మెదక్ నుంచి కొత్త రైళ్ళను ప్రారంభించాలి



నవతెలంగాణ-మెదక్

మెదక్ రైల్వే స్టేషన్ నుంచి కొత్త రైళ్ళను నడపాలని శుక్రవారం మెదక్ రైల్వే స్టేషన్ సందర్శనకు వచ్చిన రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ శరత్‌కు కాంగ్రెస్ నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజామాబాద్ నుంచి రాయలసీమ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను పొడిగించినట్లుగానే మెదక్ నుండి వెంకటాద్రి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌నూ పొడిగించాలని కోరారు. దీంతో మెదక్ నుండి తిరుపతి రాకపోకలు మెరుగుపడతాయని, వెంకటేశ్వరుడి భక్తులకు అనువుగా ఉంటుందని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మెదక్- నిజామాబాద్ - నాందేడ్ రూట్లలో నూతన రైళ్ళను ప్రారంభించాలని కోరారు. ప్రస్తుతం నడుస్తున్న కాచిగూడ- మెదక్ రైలును నాలుగు ట్రిప్పులుగా నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్ మొల్సాబ్, సోషల్ మీడియా జిల్లా కో ఆర్డినేటర్ సల్మాన్, కాంగ్రెస్ నేతలు రాంరెడ్డి, నవీన్, సంజీవ్, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

1
నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
శనివారం 24 జూన్ 2023

పోలీసులకు ఫిట్నెస్ మస్ట్..



నవతెలంగాణ-మెదక్

పోలీసులకు ఫిట్నెస్ మస్ట్ అని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియ దర్శిని అన్నారు. శుక్రవారం నూతన పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లాలోని సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్, హెూంగార్డ్ సిబ్బందికి ఆర్మ్స్ డ్రిల్, ఫుట్ డ్రిల్ ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్ఐలు అచ్యుత రావ్, నాగేశ్వర్ రావ్‌ల ఆధ్వర్యంలో పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీసులు వీక్లీ పరేడ్‌లో పాల్గొనడంతో పాటు వ్యాయామం చేయడం వల్ల ఫిజికల్ ఫిట్నెస్ ఉంటుందన్నారు. సమయం దొరికినప్పుడు వ్యాయామం చేయడం చాలా ముఖ్యం అని, మంచి శక్తి సామర్థ్యాలతో పాటు ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా విధులు నిర్వహించడానికి అవకాశం ఉంటుందన్నారు. పోలీసులు మంచి జీవన విధానాన్ని అవలంబించాలని, ఎప్పటికప్పుడు హెల్త్ చెకప్స్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ సైదులు, సిఐలు, ఎస్ఐ లు ఆర్ఎస్ఐలు జిల్లా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిని రక్షించబోయి.. మరో యువకుడు

- ప్రమాదవశాత్తు వరదకాల్వలో జారిపడి ఇద్దరి మృతి



రోహిత్



పవన్

నవతెలంగాణ-బెజ్జంకి

వరదకాలువ నీటిలో ప్రమాదవశాత్తు జారిపడిపోయిన యువకుడిని రక్షించబోయి మరో యువకుడు గల్లంతవగా.. నీటిలో మునిగి ఇద్దరూ మృతి చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని వీరాపూర్ గ్రామంలో శుక్రవారం జరిగింది. ఘటనలో స్థలంలో ఉన్న మరో యువకుడు గాలిపెల్లి ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ పట్టణానికి చెందిన దావ రోహిత్(16) స్థానిక చిలుముల పవన్(22) కుటుంబానికి సమీప బంధువు. వారిద్దరూ మరో యువకుడు గాలిపెల్లి ఉదయ్ కిరణ్‌తో కలిసి వరదకాల్వ వద్ద కాలక్షేపం చేయడానికి వెళ్లారు. రోహిత్ వరదకాల్వలో చేతులు శుభ్రపర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో జారిపోయాడు. గమనించిన పవన్ రక్షించేందుకు వరదకాల్వలో దూకాడు. వారిద్దరిని రక్షించడానికి గట్టుమీదున్న ఉదయ్ కిరణ్ అందుబాటులో ఉన్న తాడును అందజేయడానికి ప్రయత్నించగా చిన్నగా ఉండడంతో వారిద్దరూ గల్లంతయ్యారు. దీంతో ఉదయ్ కిరణ్ వీరాపూర్-తోటపల్లి ప్రధాన రోడ్డుపైకి వచ్చి కేకలు వేయసాగాడు. గమనించిన స్థానికులు వరదకాల్వ వద్దకు చేరుకునే సమయానికి ఇద్దరు యువకులు పూర్తిగా వరదకాల్వలో గల్లంతయ్యారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ప్రవీణ్ రాజు తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అట్ల రాములు(దాచారం), పోలవేణి సంపత్(తోటపల్లి) జాలర్ల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను వెలికితీశారు. మృతుడు పవన్ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రవీణ్ రాజు కేసు నమోదు చేసి మృతదేహాలకు పంచనామా నిర్వహించి పోస్ట్ మార్టం కు తరలించారు. మృతుడు పవన్ ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందడం.. గతంలో తండ్రి అంజయ్య బావి ప్రమాదంలో మృతి చెందడం గ్రామస్తులను కంటతడి పెట్టించింది. మరో మృతుడు రోహిత్ తండ్రి కొన్నేండ్ల క్రితం మృతి చెందినట్టు సమాచారం.

పేదల గూడు గోస పట్టదా..!

- ప్రభుత్వ భూముల్లో గుడిసెలేసుకుని పోరాటం
- ఏండ్ల తరబడిగా పట్టాల కోసం ఎదురుచూపు
- పలు చోట్ల పట్టాలిచ్చి పొజిషన్ చూపని వైనం
- డబుల్ బెడ్‌రూం స్కీమ్‌లో అర్హులకు దక్కని ఇండ్లు
- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమరశీల ఉద్యమం
- 25న మెదక్, సంగారెడ్డికి బస్సు యాత్ర రాక

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లాలో వందలా గ్రామాలు, పట్టణాల్లో ఇళ్ల స్థలాల్లేని పేదలు లక్షల్లో ఉన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వం ప్రతి ఇళ్లులేని పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లను నిర్మించి ఇస్తామనం చెప్పింది. దీంతో పేదలంతా తొమ్మిదేళ్లపాటు ఎదురు చూశారు. ప్రభుత్వం అరకొరగా కట్టిన డబుల్ ఇళ్లను అనర్హులకు కట్టబెట్టి అర్హులైన పేదలను పక్కన పెట్టారు. వేలాది మంది తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, కలెక్టర్ కార్యాలయాల చుట్టు తిరుగుతూ దరఖా స్తుల చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించకపోయే సరికి సీపీఐ (ఎం), ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పేదలు ప్రభుత్వ భూముల్లో జెండాలు పాతింద్రు. గుడిసెలేసు కుంద్రు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాలు చేపట్టిన బస్సు యాత్ర ఈ నెల 25న మెదక్, సంగారెడ్డి జిల్లాలో కొనసాగనుంది.

స్థలాల కోసం గుడిసెవాసుల పోరాటం

సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లోని పలు కేంద్రాల్లో పేదలు ప్రభుత్వ స్థలాల్లో ఎర్రజెండాలు పాతి గుడిసెలేసుకున్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో రాజీవ్ గృహకల్ప పెండింగ్ ఇళ్లను ఆక్రమించిన వంద మంది పేదలు పిల్లల్లు, గోడల మధ్య ఉంటున్నారు. మూడు నెలలుగా అక్కడే నివసిస్తూ అధికారులకు వినతిపత్రాలిచ్చారు. రాంచంద్రారెడ్డి కాలనీ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో వంద మంది పేదలు చెట్లు నరికి స్థలాన్ని చదును చేసుకున్నారు. అక్కడే గుడిసెలేసుకున్నారు. స్వంత ఇంటి స్థలంలేని పేదలంతా ఆ గుడిసెల్లోనే ఉంటూ జీవనం సాగిస్తున్నారు. పలు మార్లు తహసీల్దార్, కలెక్టర్‌కు ఇళ్ల స్థలాలివ్వాలని విన్న వించారు. పోలీసులు దౌర్జన్యం చేసి గుడిసెల్ని కూల్చేశారు. పేదల్ని బెదిరించి కేసులు పెట్టారు. అయినా బెదరకుండా పేద మహిళలు ముందుండి మళ్లీ బందోబస్తుగా గుడెసెలేసుకుని పోరాడుతున్నారు. సదాశివపేట మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో 2009, ఆ తర్వాత రెండు పర్యాయాలు సర్వే నెంబర్ 170లో ఉన్న 7 ఎకరాల ప్రభుత్వ స్థలంలో పేదలకు ఇళ్ల స్థలాలిస్తున్నామని పట్టా సర్టిఫికెట్లు ఇచ్చారు. ఆ తర్వాత ఆ ప్లాట్లను లబ్ధిదారులకు కేటాయించి పొజిషన్ చూపలేదు. తర్వాత ఆ పట్టాలను రద్దు చేస్తున్నామని అధికారులు చెప్పారు. ఇప్పటికీ ఆ స్థలం ఖాళీగానే ఉన్నందున పట్టాలిచ్చిన పేదలు తమకు పొజిషన్ చూపించి గృహలక్ష్మీ పథకంలో ఇళ్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నారు. శుక్రవారం వందలాది మంది పేదలు ఆత్మకూర్ నుంచి సదాశివపేట తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. మండుటెండల్లో నడుస్తూ వచ్చిన పేదలు తమకు ఎందుకు పట్టాలిచ్చి పొజిషన్ చూపట్లేదని అధికారుల్ని నిలదీశారు. సదాశివపేట పట్టణంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో 5 వేల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలిచ్చి పట్టా సర్టిఫికెట్లు ఇచ్చారు. ఆ తర్వాత వారికి పొజిషన్ చూపి ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇళ్లు మంజూరు చేయలేదు. ఆ తర్వాత పట్టాల్ని రద్దు చేసినట్లు అధికారులు చెప్పడంతో పేదలు ఆందోళనలకు దిగారు. సీపీఐ(ఎం), ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టాలిచ్చిన స్థలంలో గెడెసెలేసి ఆందోళనకు దిగారు. కంది మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్ల స్థలాలి వ్వాలని పేదలు తహసీల్దార్ ఆఫీసు ముందు ఆందోళనలు చేశారు. దరఖాస్తులిచ్చారు. ఆందోల్, నారాయణఖేడ్, జహీరాబాద్‌లోనూ పేదలు ఆందోళనలు చేశారు. అమీన్ పూర్ మున్సిపాలిటీలో పేదలు వేసుకున్న ఇళ్లను కూల్చివేశారు. మెదక్ జిల్లాలోనూ ఇళ్ల స్థలాల పోరాటం జరుగు తోంది. మెదక్ పట్టణంలోని హమాలీ కాలనీలో 50 మంది పేదలు గుడిసెలేసుకుని అక్కడే ఉంటున్నారు. వారంతా తమకు ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చి ఇళ్లు కట్టుకునేందుకు సాయం చేయాలని పోరాడుతున్నారు. నిజాంపేట, హవేలీ ఘన్‌పూర్, రామాయంపేట మండలాల్లోనూ ఇళ్ల స్థలాల కోసం పేదలు ఆందోళనలు చేశారు. సిద్దిపేట జిల్లాలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, సిద్దిపేట, అక్కన్నపేట, గజ్వేల్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల కోసం ఆందోళనలు చేశారు. కొన్ని చోట్ల గుడెసెలే సుకున్నారు. డబుల్‌బెడ్ రూం ఇళ్లు కట్టిన చోట తమకు ఇళ్లు కేటాయించాలని దరఖాస్తులు చేశారు.





"పాలకులకు నిరుపేదల గూడు గోస పట్టట్లేదు. స్వరాష్ట్రమొచ్చాక ఇళ్లులేని పేదలంటూ ఉండబోరని చెప్పిన కేసీఆర్ పాలనలోనూ ఇళ్లు, స్థలాల సమస్య తీరలేదు. వేలాది కుటుంబాలు నిలువు నీడలేక అద్దెకొంపల్లో మగ్గుతున్నారు. ఏనాటికైనా సర్కార్ గింత స్థలమిచ్చి గూడు నిర్మాణాకి సాయం చేయకపోదా అని పేదలు ఎంతో ఆశతో ఎదురు చూస్తూ వచ్చారు. ప్రభుత్వం పట్టీపట్టనట్లు ఉండేసరికి పేదలు పోరాటానికి పూనుకున్నారు. ప్రభుత్వ స్థలాల్లో గుడెసేసుకుని అక్కడు పూట గడుపుతున్నారు. ఇళ్ల స్థలాలిచ్చి ఇంటి నిర్మాణానికి సాయం చేయాలని కోరుతున్నారు."

25న బస్సు యాత్ర

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర ఈ నెల 25న మెదక్, సంగారెడ్డికి రానుంది. ప్రజా సంఘాల నాయకులు ఎస్. వీరయ్య, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంక్రటాములు, వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, సోషల్ మీడియా ఇంచార్జీ జగదీశ్‌తో కూడి యాత్ర బృందం మెదక్, సంగారెడ్డి పట్టణాల్లో పర్యటించ నున్నారు. గుడెసెలు వేసుకున్న పేదలతో మాట్లాడ తారు. పేదల గుడెసెల్లోనే భోజనం చేసి బస చేయనున్నారు.



ఏపీజీవీబీలో రుణాలపై అతి తక్కువ వడ్డీ రేట్లు

నవతెలంగాణ-రామచంద్రాపురం

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులో అన్ని రకాల గృహ రుణాలపై మిగతా బ్యాంకులన్నింటికన్నా తక్కువ వడ్డీ రేట్లు ఉన్నట్టు ఏపీజీవీబీ బ్యాంక్ చైర్మన్ కె.ప్రతాపరెడ్డి తెలిపారు. శుక్రవారం ఏపీజీవీబీ అశోక్ నగర్ రాస్ మెక్ మరియు సంగారెడ్డి రీజినల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహ రుణాలు, వివిధ రుణాల్లో ఏపీజీవీబీలోనే అతితక్కువ వడ్డీ రేట్లు కలిగి ఉందన్నారు. గృహ రుణాలపై ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు లేదని, సెప్టెంబర్ 30వ తారఖు వరకు ఏపీజీవీబీ అన్ని బ్రాంచులలో హౌసింగ్ మేళా నిర్వహిస్తున్నా మన్నారు. వినియోగదారులు ఈ సదావకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్ర్యమంలో జనరల్ మేనేజర్ కె.ఈశ్వర సుబ్రమణ్యం, సంగారెడ్డి రీజినల్ మేనేజర్ ఎస్.ఎల్.ఎన్ ప్రసాద్, అశోక్ నగర్ రాస్ మెక్ చీఫ్ మేనేజర్ శ్రీనివాస్ చెన్న మరియు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం ఆశీస్సులతో అభివృద్ధిలో అగ్రగామిగా పటాన్‌చెరు

- సభకు తరలివచ్చిన కార్యకర్తలకు పాదాభివందనం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



నవతెలంగాణ-పటాన్‌చెరు

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో పటాన్ చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం పటాన్ చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. పటాన్‌చెరు పట్టణంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి శంకు స్థాపన కార్యక్రమానికి సీఎం వస్తున్నారని తెలిపిన మూడు రోజుల్లోనే గ్రామ గ్రామాల నుండి వచ్చి.. సభను విజయవంతం చేసిన ప్రతి కార్యకర్త, నాయకుడికి శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన ప్రధాన హామీల అమలుపై శుక్రవారం ఉదయం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుతో చర్చించడం జరిగిందని, శరవేగంగా హామీలను అమలు చేయబోతున్నట్లు మంత్రి తెలిపారన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సంపూర్ణ అవగాహన ఉందని, ఇందుకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధికి రూ.128 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. నిధుల మంజూరు పట్ల సంపూర్ణ సహకారం అందించిన రాష్ట్ర మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆశీస్సులతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పటాన్ చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతున్నారన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని సీఎం కేసీఆర్ వేలాది మంది ప్రజల సమక్షంలో ప్రకటించడం నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. లక్ష మెజారిటీతో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ని గెలిపిం చుకుంటామన్నారు. అనంతరం నియోజకవర్గ ప్రజాప్ర తినిధులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, పటాన్ చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీలు సుధాకర్ రెడ్డి, కుమార్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, కార్పొరేటర్లు కుమార్ యాదవ్, పుష్ప నగేష్, సీనియర్ నాయకులు ఆదర్శ్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, బాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తల్లి జ్ఞాపకార్థం నోట్‌బుక్స్ పంపిణీ

నవతెలంగాణ-దౌల్తాబాద్

శ్రీధర్, శ్రీకాంత్ అనే సోదరులు తమ తల్లి లక్ష్మి జ్ఞాపకార్థం మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు తమ తల్లి జయంతిని పురస్కరించుకొని నోటు పుస్తకాలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నంత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆది వనిత, ఎంఈఓ బండి నర్సవ్వ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రత్నాకర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అర్హులైన నిరుపేదలకు గృహలక్ష్మి మంజూరు చేయాలి

నవతెలంగాణ-హవేలీఘనపూర్

అర్హులైన నిరుపేదలకు వెంటనే గృహలక్ష్మి పథకం మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే.మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహేష్‌కు డిమాండ్లతో కూడిన పత్రాన్ని శుక్రవారం అందజేశారు. అంతకుముందు కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షలు ఇంటి నిర్మాణం కోసం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లే శం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తారని హామీ ఇచ్చి.. జిల్లాలో సుమారు 6000 మంజూరు కాగా, 2000 ఇండ్లు మాత్రమే పేదలకు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఇండ్లు లేని పేదల కు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివాసముంటు న్నారన్నారు. 26 జిల్లాల్లో 60 కేంద్రాల్లో గుడిసెలు వేసుకుని పోరాటం చేస్తున్నారన్నారు. కాగా జీవో నెంబర్ 59 ప్రకారం ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి గృహలక్ష్మి పథ కం వర్తిస్తుందని జీ.వోలు ఉందన్నారు. గ్రామాల్లో జీవో నెం బర్ 59 పేదలు రిజిస్ట్రేషన్ చేసుకోలేదన్నారు. కాబట్టి ఇలా ంటి షరతులు లేకుండా ఇంటి స్థలం ఉన్న పేదవారికి గృహ లక్ష్మీ పథకం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో నాయకులు రవి నారాయణ, సిద్ధమ్మ, స్వరూప, విజయ్, సోనీ, బూలి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-రాయపోల్

కుటుంబ కలహాలతో మూడ్రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాయపోల్ మండలం గొల్లపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. రాయపోల్ పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లి గ్రామానికి చెందిన చిన్నోళ్ల యాదగిరి (43) వ్యవసాయం చేసు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే యాదగిరికి మద్యం సేవించే అలవాటు ఎక్కువగా ఉండడంతో మంగళవారం తెల్లవారుజామున భార్య, భర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఇంట్లో నుండి వెళ్లిపోయిన యాదగిరి తిరిగి రాలేదు. తెలిసిన ప్రాంతాలు, బంధువులు, గ్రామాల్లో వెతికినప్పటికీ జాడ తెలియలేదు. దీంతో గురువారం రాయపోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా శుక్రవారం మధ్యాహ్నం దౌల్తాబాద్ మండలం దీపాయం పల్లి గ్రామం అడవిలో చెట్టుకు ఉరి వేసుకొని ఒక వ్యక్తి చనిపోయి కనిపించాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో అతడు యాదగిరిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు కరుణాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ పోలీసులు తెలిపారు.

బక్రీద్ సందర్భంగా మటన్ వ్యాపారులకు సూచనలు

నవతెలంగాణ-కోహిర్



బక్రీద్ పండగ సందర్భంగా మండలంలోని మటన్ వ్యాపారులకు సీఐ భూపతిరాజు, ఎస్సై సురేష్‌లు పలు సూచనలు చేశారు. ఆవులు, లేగలు కోయొద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ప్రారంభం

నవతెలంగాణ-మెదక్

మెదక్ జిల్లా కోర్టు ప్రాంగణంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్‌ను వర్చువల్‌గా హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ శుక్రవారం ప్రారంభించారు. బడుగు బలహీన వర్గాలకు క్రిమినల్ కేసుల్లో సమర్థవంతంగా న్యాయ సహాయం అంది ంచడంలో, న్యాయం జరిగేలా చేయడంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వ్యవస్థ కీలకంగా నిలుస్తుందన్నారు. ఈ కా ర్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మిశారద, అడిష నల్ కలెక్టర్ ప్రతిమా సింగ్, న్యాయమూర్తులు జితేందర్, రీ టా లాల్ చంద్, కల్పన, ఆర్డిఓ సాయిరాం, డీఎస్పీ సైదులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జెన్నారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలి

- ఎన్పీఆర్డీ రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య
- ఛలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరణ



నవతెలంగాణ-సంగారెడ్డి

వికలాంగులకు సామాజిక భద్రత, పెన్షన్ పెంపు, ప్రతీ కుటుంబానికి అంత్యోదయ రేషన్ కార్డు, నామినేటెడ్ పదవుల్లో రిజ్వేషన్స్ అమలు చేయాలనే డిమాండ్‌తో జూలై 10న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఏం.అడివయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణం లోని జిల్లా కార్యాలయంలో 'ఛలో ఢిల్లీ' కార్యక్రమం జయప్రదం చేయాలని కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 2011 జనాభా లెక్కల ప్రకారం (7రకాల వైకల్యాల ప్రకారం) 2.68 కోట్ల మంది వికలాంగులు ఉన్నారన్నారు. వికలాంగులకు ఎలాంటి భద్రత లేదన్నారు. వికలాంగులకు సామాజిక భద్రత కల్పించేందుకు ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. 2023 జూన్ నుండి ప్రారంభం అవుతున్న ఎన్ఎఫ్‌హెచ్ఎస్ 6వ సర్వేలో వికలాంగుల వివరాలు నమోదు చేయడానికి అవకాశం లేకుండా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఐక్య రాజ్య సమితి హక్కుల ఒప్పందం, 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం వికలాంగులను సామాజిక జీవనంలో భాగస్వామ్యం చేయాలని పేర్కొన్నా.. ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మెంటల్ హెల్త్ కేర్ ఆక్ట్ ప్రకారం మానసిక వికలాంగుల సంరక్షణ బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లకుంద న్నారు. దేశ వ్యాప్తంగా యూనిక్ దిసెబుల్డ్ ఐడి పంపిణీ చేయాలనీ నిర్ణయించినా.. నేటికీ 90.70లక్షల కార్డులు పంపిణీ చేశారన్నారు. ఇప్పటి వరకు పంపిణీ చేసిన యుడి ఐడి కార్డ్స్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు చెల్లుబాటు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వికలాంగులందరికీ యుడి ఐడి కార్డులు పంపిణీ చేయకుండానే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు యుడి ఐడి కార్డు తప్ప నిసరి చేయాలని నిర్ణయించడం సరైనది కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం వికలాంగులకు విద్యను అందించేందుకు, సాధా రణ విద్యార్థులతో వికలాంగులు కలిసిపోయే సమగ్ర విద్యా విధానం రూపొందించాలనీ డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో 4శాతం రిజర్వేషన్స్ అమలు చేయాల్సి ఉన్నప్పటికీ సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వ శాఖల్లో అమలు అవుతున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ నియామకాల్లో వికలాంగులకు రిజర్వేషన్స్ అమలు చేయడం లేదన్నారు. ప్రైవేట్ రంగంలో కూడా వికలాంగులకు రిజరేషన్స్ అమలు చేయడానికి ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగులపై వేధిం పులు, మహిళలపై లైంగిక వేదింపులు, అత్యాచారాలు, హత్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా ఒకే పింఛన్ అమలు చేయాలని, పింఛన్ 10,000లకు పెంచాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం జూలై 10న జరిగే ఛలో ఢిల్లీనీ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. వెంకటేష్, జిల్లా నాయకులు రమేష్, మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల భూములు కార్పొరేట్లకు కట్టబెడుతున్న కేసీఆర్



నవతెలంగాణ-వర్గల్

పచ్చని పేదల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టి సీఎం కేసీఆర్ సొమ్ము చేసుకుంటున్నారని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ఆరోపించారు. 2013 చట్టం వర్తింప చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎంపీటీసీ యాదయ్య ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న అవుసులోనిపల్లి, రామక్కపేట, నగరం తండా నిర్వాసితులకు శుక్రవారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, కిసాన్ సెల్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండ రెడ్డి, పిసిసి కార్యదర్శి ప్రమోద్ కుమార్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివంగత వైఎస్సార్ హయాంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో 24 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు పంచగా, ప్రస్తుతం వాటిపై సీఎం కేసీఆర్ కన్ను పడిందని ఎద్దేవా చేశారు. గజ్వేల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొంటున్న సీఎం కేసీఆర్ అమరుల ఆకాంక్షలకు భిన్నంగా పేదలను మరింత నిరుపేదలు చేసి నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నారన్నారు. వ్యవసాయ అను బంధ పరిశ్రమల ఏర్పాటు పేరిట వర్గల్ ప్రాంతంలో సుమారు 1500 ఎకరాలు సేకరించి తన అనుచరులకు కట్టబెడుతున్నట్లు విమర్శించారు. అయితే భూములలోకి ఎవరిని అడుగుపెట్ట నీయవద్దని, 4 నెలల అనంతరం వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వంలో తిరిగి అప్పగిస్తామని స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీసు అధికారుల అండతో చట్టవిరుద్ధంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి.. పేదల పొట్టగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, లీగల్ సెల్ నేత గోపాలరావు , మాజీ జెడ్పిటిసి ప్రభుదాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్ రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, మండలాల బాధ్యులు మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ గుప్త, భాస్కర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, నేతలు సదానంద రెడ్డి, వెంకటేష్, సుల్తాన్, ప్రవీణ్ గౌడ్, రామచంద్ర గౌడ్, బాల్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కిషన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్‌తో అధిక లాభాలు



నవతెలంగాణ-జగదేవపూర్

ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్ ఫామ్‌తో అధిక లాభాలు సాధించ వచ్చని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు. బస్వాపూర్ గ్రామంలో సాగుచేసిన ఆయిల్ ఫామ్, పత్తి, వరి నారు మరియు జీలుగ పంటలను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న రాయి తీలను ఉపయోగించుకొని రైతులు ఎక్కు వ విస్తీర్ణంలో ఆయిల్ ఫామ్ ను సాగు చేయాలని తెలిపారు. ఆయిల్ ఫామ్ పంట పెట్టిన నాలుగో సంవత్సరం నుండి ఆదాయం వస్తుందన్నారు. చీడపీడలు తక్కువ అని, పెట్టుబడి ఇతర పంటలతో పోలిస్తే చాలా తక్కువగా ఉంటుందన్నారు. వరి పంటను ఒక నెల ముందు వేసుకుంటే అకాల వర్షాలు మరియు వడగండ్ల బారి వాన నుండి తప్పించుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం 140 రోజులు అంతకన్నా ఎక్కువ కాల వ్యవధి గల వరి రకాలను వేయొద్దని, 120 నుండి 125 రోజుల కాల వ్యవధి గల రకాలను వేసుకోవాలని రైతులను కోరారు. అలాగే వరి నాట్లు వేసే భూముల్లో జీలుగా, జనుము పచ్చిరొట్ట విత్తనాలు వేసుకొని 30 నుండి 40 రోజుల తర్వాత భూమిలో కలియుదున్నితే భూసారం పెరుగుతుందని మరియు చౌడు తగ్గుతుందన్నారు. పత్తి విత్తే రైతులు 60 మిమీ వర్షం పడ్డ తర్వాత విత్తనాలు వేసుకోవాలని సూచించారు. పొడి దుక్కిలో పెట్టొదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి వసంతరావు, వ్యవసాయ విస్తీర్ణ అధికారి కిరణ్ కుమార్, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ విజయ్, రైతులు నరసింహారెడ్డి గ్రామ కో ఆర్డినేటర్, ప్రభాకర్ రెడ్డి, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం తిమ్మాయిపల్లి మధిర గ్రామం భాషాయి గూడానికి చెందిన గట్టు బాలమల్లు అనారోగ్యంతో మృతి చెందాడు. అతనిది పేద కుటుంబం కావడంతో.. సర్పంచ్ ఎలా లత కృష్ణ నాలుగు వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ జింగిటి రాజు, మాజీ ఎంపీటీసీ కల్వకుంట్ల నర్సింలు, పుట్ట కిష్టయ్య, చేర్యాల రాజు, పుట్ట వెంకటయ్య, కనకయ్య, అన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్లాస్టిక్ రహిత సమాజంలో విద్యార్థుల భాగస్వామ్యం కావాలి



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

ప్లాస్టిక్ రహిత సమాజంలో విద్యార్థుల భాగస్వామ్యం కావాలని ఎర్త్ ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. శుక్రవారం నారాయణరావుపేట మండలం జక్కపూర్ ప్రాథమిక పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ శిబిరాన్ని ఏర్పాటుచేసి విద్యార్థులకు సెల్ ఫోన్ వాడడం వల్ల జరిగే నష్టాలపై, ప్లాస్టిక్ వాడటం వల్ల జరిగే నష్టాలపై అవగాహన, పేపర్ బ్యాగ్స్ తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా శిబిరం వల్ల సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేశారు. శిబిరంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అన్వర్, ఫౌండేషన్ ప్రతినిధులు మంగళంపల్లి రాజు , వెన్నెల , ఆంజనేయులు, ఎస్ఎంసి చైర్మెన్ రజిత , ఉపాధ్యాయులు శ్రీనివాస్, సత్యం, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 2
సంగారెడ్డి
శనివారం 24 జూన్ 2023



జోగిపేటలో డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

నవతెలంగాణ-జోగిపేట

డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా జహీరాబాద్ మాజీ పార్లమెంట్ కన్వీనర్ ఆర్.ప్రభాకం గౌడ్ జోగిపేట పట్టణంలో శుక్రవారం ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమంలో అందోల్ మాజీ అసెంబ్లీ కన్వీనర్ ప్రభాత్ కుమార్, జోగిపేట ఆంజనేయులు యాదవ్, జిల్లా ఓబీసీ మోర్చా వెంకటరమణ, అందోల్ మండల మాజీ అధ్యక్షులు మహేందర్, నందకుమార్, పుల్కల్ మండల ఉపాధ్యక్షులు జగన్ గౌడ్, అందోల్ మండల మైనార్టీ మోర్చా ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



ఉట్ల గంగమ్మ జాతరకు నీలం మధు రూ.లక్ష విరాళం

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని ఊట్ల గ్రామంలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఈనెల 25 ఆదివారం నిర్వహించ తలపెట్టిన గంగమ్మ జాతరకు భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ శుక్రవారం ఒక లక్ష రూపాయల విరాళం నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు అయిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లడుతూ ముదిరాజులు ఆర్థిక రాజకీయ రంగాలలో రాణించాలన్నారు. సీఎం కేసీఆర్ సబ్బండ వర్గాల వారికి పెద్దపీట వేసి ఆయా వర్గాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలను చేపడుతునారన్నారు.ఈ కార్యక్రమంలో ఉట్ల మత్స్యశాఖ అధ్యక్షులు సుంకరబోయిన మహేష్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పూజారి రాజు, వార్డ్ మెంబర్ బోగురు లక్ష్మణ్,పూజారి వెంకయ్య, బొగురు సత్యనారాయణ, బొగురు మల్లేష్, వీరబోయిన సాయి కుమార్, బొగురు బాలేష్, పూజారి పెద్ద శీను, కర్రే నాగరాజు, పూజారి రమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.





విష్ణువర్ధన్‌రెడ్డికి ఘన సన్మానం

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డిని సంఘం సభ్యులు బార్ అసోసియేషన్ హాల్లో పూలమాలవేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులకు మధ్యాహ్న భోజనం పథకం గత సంవత్సరం జూన్ 23 నుండి ప్రారంభమై నేటితో సంవత్సరం అయిన సందర్భంగా ఈ సన్మానం చేశారు. అనంతరం విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, రామ్ రెడ్డి, అరుణకుమారి, దయాకర్ రెడ్డి, సురేందర్, నాగరాజ్, సతీష్, రాములు తదితరులు పాల్గొన్నారు.



బట్రాజుల రాష్ట్ర యువజన, మహిళా ఎన్నికల సన్నాహక సమావేశం

నవతెలంగాణ-సంగారెడ్డి

బట్రాజుల రాష్ట్ర యువజన, మహిళా ఎన్నికల సన్నాహక సమావేశాన్ని శుక్రవారం సంగారెడ్డిలోని రాజధాని బ్యాంకెట్ హాల్‌లో జిల్లా భట్రాజు సంఘం అధ్యక్షులు ఆధ్వర్యంలో నంది భట్టు నర్సింహ్మరాజు నిర్వహించారు. ఈ సమావేశానికి యువజన అధ్యక్షుడిగా పోటీ చేసే అభ్యర్థి కూరపాటి నర్సింహ్మ రాజు మాట్లాడుతూ.. అన్ని జిల్లాల్లో పర్యటన భాగంగా సంగారెడ్డి రావడం జరిగిందన్నారు. జులై 2న హైదరాబాద్ భట్రాజు సంఘ భవనం ఎల్బీనగర్‌లో రాష్ట్ర యువజన ఎలక్షన్లు నిర్వహిస్తున్నామన్నారు. బట్రాజు అధిక సంఖ్యలో ఎన్నికల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్ రాజు, సంపత్ రాజు, మధుసూదన్ రాజు, రాంబాబు రాజు, వీర్రాజు, ప్రభాకర్ రాజు,భాస్కర్ రాజు, నరేందర్ రాజు, వినోద్ రాజు, నరసింహారాజు, శశి భూషణ్ రాజు, రామరాజు, మనోహర్ రాజు, శ్రీనివాసరాజు, దిలీప్ కుమార్ రాజు, వెంకటేశ్వర్ రాజు, రాఘవేంద్ర రాజు, బీ ఆర్ఎస్ ఎంపిటిసి జయప్రద రామరాజు పాల్గొన్నారు.



టీడీపీ పటాన్చెరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా సత్యనారాయణ

నవతెలంగాణ-రామచంద్రాపురం

టీడీపీ పటాన్చెరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా రామ చంద్రాపురం పట్టణానికి చెందిన కరికే సత్యనారాయణ నియమి తులయ్యారు. తెలంగాణ టీడీపీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవానికి తనవంతు కృషి చేస్తానన్నారు. త్వరలోనే నియోజకవర్గంలో గ్రామ స్థాయి వరకూ కమిటీలను వేస్తామన్నారు. మెదక్ పార్లమెంట్ కమిటీ సభ్యుల్లో పటాన్చెరు నియోజకవర్గం నుండి ఉపాధ్యక్షులుగా కృష్ణ , కార్యదర్శులుగా అశోక్, రఫిక్‌లను ఎన్నుకున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. తన మీద నమ్మకంతో పటాన్చెరువు నియోజకవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు అప్పజెప్పిన రాష్ట్ర అధ్యక్షులు జ్ఞానేశ్వర్, రాష్ట్ర కార్యదర్శి గంగాధర్, మెదక్ పార్లమెంటరీ కమిటీ అధ్యక్షులు రమేష్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కృష్ణ, అశోక్, రఫిక్ ,చలపతిరావు, నజీర్, విశ్వనాథ్, కృష్ణ గౌడ్, రాజు, గోవర్ధన్, క్రైఫ్, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



భూముల్లోకి వెళ్లకుండా బౌండరీలు


- వోక్సన్ బిజినెస్ స్కూల్ ఎదుట రైతుల ధర్నా

నవతెలంగాణ-మునిపల్లి

తమ భూముల్లోకి వెళ్లనీయకుండా వోక్సన్ బిజినెస్ స్కూల్ బౌండరీలు ఏర్పాటు చేసిందని ఆరోపిస్తూ.. బాధిత రైతులు వోక్సన్ గేటు ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు బాధిత రైతులు మాట్లాడుతూ.. మునిపల్లి మండలం కంకోల్ గ్రామ శివారులో వోక్సన్ బిజినెస్ స్కూల్ భూములను కొనుగోలు చేసి బౌండరీ వాల్ ఏర్పాటు చేసింద న్నారు. అయితే తమ భూములు కూడా అందులోనే ఉన్నప్పటికీ వెళ్లకుండా అడ్డగిస్తున్నారని రైతులు వాపోయారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

అనంతరం తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ యాదవ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు రైతులకు బతకడానికి ఇచ్చిన భూములను లాక్కొని.. పంటను పండించుకోకుండా, పొలానికి వెళ్లడానికి దారి లేకుండా గేట్లు మూశారన్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా పేద రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నరేష్, జహీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ నర్సింలు, రాయికోడ్ మండల్ తీన్మార్ మల్లన్న టీం అధ్యక్షులు బోయిని జగన్నాథ్, మునిపల్లి మండల అధ్యక్షులు జగన్, తీన్మార్ మల్లన్న టీం నాగిరెడ్డిపల్లి, గోపాల్, ప్రభాకర్ రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా విజయ్ కుమార్



విజయ్‌కుమార్



రమేష్

నవతెలంగాణ-కొండాపూర్

సంగారెడ్డి జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా కళ్యాణ్కర్ విజయ్‌కుమార్, ప్రధాన కార్య దర్శి గుండు రమేష్ ఎన్నిక య్యారు. ఉపాధ్యక్షులుగా మల్లేశం సహాయ కార్యదర్శిగా శ్రీదేవి, కోశాధికారిగా ప్రభాకర్ రెడ్డి, సభ్యులుగా వీరయ్య, అనుషలు ఎన్నిక య్యారు. వారు ఎన్నికను తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్ ఆమోదం తెలిపినట్లు జిల్లా అధ్యక్షులు విజయకుమార్ తెలిపారు.

సమిష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం

- డ్రగ్స్ రాకసిని తరిమికొట్టాలి
- ప్రతీ గ్రామ పంచాయతీకి రూ.15 లక్షల మంజూరు
- నిర్దేశించిన గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
- పటాన్‌చెరు మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఇందుకు ఉదాహరణ పటాన్‌చెరు నియోజకవర్గంలోని అత్యధిక గ్రామ పంచాయతీలకు జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులు రావడమేనని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండల పరిషత్ అధ్యక్షురాలు సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ పటాన్‌చెరు సభలో పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామపంచాయతీకి రూ.15 లక్షలు మంజూరు చేశారన్నారు. ఎన్నికల కోడ్ వచ్చే లోపు ప్రతీ పైసా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు మనపై నమ్మకంతో గురతర బాధ్యత అప్పగించారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో యువత మత్తుపదార్థాలకు బానిస అవుతున్నారని పలువురు ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఎక్సైజ్ మరియు పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి డ్రగ్స్ రాకసిని తరిమికొట్టాలని ఆదేశించారు. తాను ఎంపీటీసీగా, ఎంపీపీగా పని చేసిన రోజుల్లో లక్ష రూపాయల మంజూరు కోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేదని నేడు సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామాలకు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు సొంత నిధులతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. గ్రామాల్లో శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని అధికారులను హెచ్చరించారు. శంకుస్థాపన చేసి కాలయాపన చేయడం తనకు నచ్చదన్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని మిగతా సమయం అంతా అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో నిమగ్నం కావాలని సూచించారు. అనంతరం వివిధ విభాగాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్న రామేశ్వరం బండ, కర్దనూరు, గ్రామ పంచా యతీల పాలకవర్గాలనుఎమ్మెల్యే జీఎంఆర్ ఘనంగా సన్మానించారు.



ఎమ్మెల్యే జీఎంఆర్‌కు సన్మానం..

పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు రూ.15 లక్షల చొప్పున సీఎం కేసీఆర్ చేత మంజూరు చేయించడం పట్ల పటాన్చెరు ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ సుప్రజా వెంకటరెడ్డి, మండల ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

రాబోయే ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యే జీఎంఆర్‌కు టికెట్ కేటాయిస్తూ సీఎం కేసీఆర్ ప్రకటన చేయడం పట్ల ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మండలాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఎంపీడీవో బన్సీ లాల్, పంచాయతీరాజ్ శాఖ డీఈ సురేష్, డిప్యూటీ తహసీ ల్దార్ రాములు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సంగారెడ్డి పట్టణంలో ఒలంపిక్ రన్

నవతెలంగాణ-సంగారెడ్డి

37వ అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో సంగారెడ్డి జిల్లా ఒలంపిక్ స్టీరింగ్ కమిటీ, జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో రెండు కిలోమీటర్ల ఒలంపిక్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మెన్ చింతా ప్రభాకర్ ఒలంపిక్ టార్చ్ వెలిగించి ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. విద్యార్థులందరూ క్రీడల్లో కూడా రాణించాలని దేశానికి అంతర్జాతీయ స్థాయిలో పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ చైర్మన్ చంద్రశేఖర్, బీరయ్య యాదవ్, కన్వీనర్ హరికిషన్, కోకన్వీనర్లు జి వెంకటేశం, ఎండి జావిద్ అలీ, హనుమంత్ గౌడ్ పాల్గొన్నారు, జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ ఆఫీసర్ రామచంద్ర, జూడో అసోసి యేషన్ అధ్యక్షులు పట్న మాణిక్యం, కార్యదర్శి వెంకటేశం, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు పులిమామిడి రాజు, కార్యదర్శి దశరథ్, వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ ఎండి ఆసిఫ్, కసిని విక్రాంత్, విజేందర్ రెడ్డి, ప్రభు గౌడ్, విద్యార్థులు, పీఈటీలు పాల్గొన్నారు.

సాగులో సాంకేతిక అంశాలపై రైతులకు అవగాహన ఉండాలి



నవతెలంగాణ-జహీరాబాద్

వ్యవసాయాధికారులకు, రైతులకు పంటసాగులోని సాంకేతికత పట్ల అవగాహన ఉన్నప్పుడే..అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయ్ కుమార్ అన్నారు. డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులకు, వ్యవసాయ విస్తరణ అధికారులకు వివిధ రకాల పంటలకు సంబంధించిన సాంకేతిక అంశాల పైన డాక్టర్ విజయ్ కుమార్ అవగాహన కల్పించారు. ముందుగా వేరు పురుగు సమస్య ఉన్న చెరకు పంట పొలాన్ని సందర్శించి రైతుకు సూచనలు చేశార. అనంతరం స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు బిక్షపతి మాట్లాడుతూ.. క్లస్టర్ వారీగా, పంటల వారీగా సమస్యలను శాస్త్రవేత్తకు తెలపాలని కోరారు. చెరకులో అధికంగా వేరు పురుగు మరియు జొన్నమల్లె కలుపు సమస్యను శాస్త్రవేత్తకి వివరించారు. చెరకులో వేరు పురుగు నివారణకు జీవ రసాయన మందు అయిన మెటారైజియంను డ్రిప్ ద్వారా పంపించాలన్నారు. అలాగే రసాయన మందు లాసెంటా ద్వారా కూడా నివారించు కోవచ్చు అన్నారు. జొన్న, మల్లె ఈ కలుపు మొక్క చెరుకు పై ఆధారపడి వేరు మొదల్లో పెరుగుతూ చెరకు పంట పెరుగుదలను నియంత్రిస్తుందన్నారు. దీని నివారణకు రసాయన పద్ధతిలో 2,4-డి సోడియం సాల్ట్ 6గ్రా./ లీటర్ యూరియా 20 గ్రా./ లీటర్ నీటిలో కలిపి వేరు మొదళ్ళు పూర్తిగా తడిచేలా భూమిలో పోసుకోవాలన్నారు. ఇప్పటికే ఎవరైనా పంటలు సాగు చేస్తుంటే.. వర్షాభావ పరిస్థతుల్లో పంటలను కాపాడుకోవడానికి 13-0-45 (మల్టీ-కే) 5 గ్రా./లీటర్ నీటిలో కలిపి వారానికి రెండుసార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. వర్షాలు లేని కారణంగా కంది లాంటి పంటలను నర్సరీ పద్ధతిలో పెంచుకొని నాటుకోవచ్చు అని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల వ్యవ సాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, స్థానిక సర్పంచ్ జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్టీ స్టేట్ విత్తన సహకార సంఘాలను ఏర్పాటు చేసుకోవాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

మల్టీ స్టేట్ విత్తన సహకార సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా సహకార అధికారి తుమ్మ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు వ్యవసాయ విధానంలో, వ్యవసాయ సాగు మార్పు చేయుటలో మల్టీ స్టేట్ కో- ఆపరేటివ్ సంఘం చట్టం 2002 ద్వారా మల్టీస్టేట్ సహకార విత్తన సంఘం ఏర్పాటుకు రైతులను ప్రోత్సాహించే దిశగా 'సహకారం ద్వారా సమృద్ధి' లక్ష్యంగా సహకారాభివృద్ధిలో భాగంగా ఈ సహకార సంఘాలు ఏర్పాటు జరుగుతు న్నదన్నారు. ఈ మల్టీస్టేట్ సహకార విత్తన సంఘాలు ప్రాథమిక స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు ఏర్పాటు కానుం డడంతో.. జాతీయ ఎపెక్స్ సంఘంలో సభ్యులుగా భాగస్వాములవుతారన్నారు. ఎన్నికల ద్వారా ఏపెక్స్ సొసైటీలో బెలాననుసరించి బోర్డులో తమ ప్రతినిధిని పంపవచ్చునన్నారు. ముఖ్యంగా దీని ఉద్దేశం ఉత్పత్తి, సేకరణ, బ్రాండింగ్, లేబిల్ ప్యాకేజింగ్, నిలువ ఉంచడం అన్నారు. మార్కెటింగ్, శుద్ధి చేయ బడిన విత్తన సరఫరా, ప్రయోగాత్మకంగా అభివృద్ధి పరచడం, స్థానికంగా లభించే సహజసిద్ధమైన దేశీయ విత్తన సంరక్షణ వాటి ప్రాచుర్యాన్ని పెంపొందించడం. ఈ మల్టి స్టేట్ విత్తన సహకార సంఘాల ఏర్పాటు ఉద్దేశం, విత్తన మార్పిడి విధానాన్ని ప్రాచుర్య పరచడం, ధరల వ్యత్యాసాల మార్పు చేయడం పంటల అంతరాలను తగ్గించి ఉత్పత్తిని పెం చడం అపెక్స్ సొసైటీ చూసుకుంటుందన్నారు. ఈ సంఘా లను వ్యవసాయం రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధనా కౌన్సిల్ ఐసిఏఆర్, జాతీయ విత్తనాభివృద్ధి సంస్థలు వాటి వాటి పథకాల ద్వారా సహాయ సహ కారాలనందిసాయన్నారు. సహకారం ద్వారా సమృద్ధిలో భాగంగా ఈ సహకార సంఘాలు గ్రామీణ ప్రాంతాల్లో రైతులు విత్తనాలపై విజ్ఞానాన్ని, మార్కెటింగ్ల ద్వారా వ్యాపార సంస్థల యేర్పాటు దిశగా మారడంతో గ్రామీణాభివృద్ధి సాధించడమే కాక వారు స్వయం సమృద్ధి దిశగా అడుగు లేస్తారన్నారు. ఈ సంఘముల వలన సభ్యులు సరియైన ధరలను పొందడమేకాక వారి ఉత్పత్తులను పెంచుకోవడం, ఎక్కువ ఉత్పత్తులనిచ్చే రకరకాల వంగడాలతో పంటలను అభివృద్ధి పరచుకోవడం మరియు మిగులు లాభాలను ఆర్జించడంతో వారితో వారు డివిడెండ పంచుకొనే వీలుంటుందన్నారు. ఈ విధానాలను పాటిం చడం వలన ఒకే రక మైన విత్తనం ఒకే బ్రాండ్ పై లభిస్తుం డడంతో రైతులు ఎటువంటి అయోమయానికి గురి కాకుం డా ఉంటారన్నారు. జాతీయస్థాయిలో విత్తన సంఘా లు క్వాలిటీ విత్తనోత్పత్తి పెంచడంతో జాతీయ వ్యవసాయ ఉత్ప త్తి పెరగడమే కాక ఉద్యోగ కల్పనలు కూడా పెరుగు తాయని.. విత్తనాల దిగు మతి తగ్గి మన విత్తనం మనం స్వయంగా పెంపొయి ంచుకోవడంతో 'మేకిన్ ఇండియా' ప్రాచుర్యంతో ఆత్మనిర్భర్ భారత దిశగా అడుగ లేస్తా యన్నారు. ఆసక్తిగల రైతులు ఈ మల్టీస్టేట్ విత్తన సహకార సంఘాలను ఏర్పాటు చేసుకొని స్వయం సమృద్ధిని సాధించవచ్చునన్నారు. ఈ సదవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్విజ్ కాంపిటీషన్‌లో అధిక సంఖ్యలో పాల్గొనాలి

నవతెలంగాణ-జహీరాబాద్

రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో యువత అధిక సంఖ్యలో పాల్గొని దిగ్విజయం చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ఇన్‌ఛార్జి తరుణ్ గౌడ్ అన్నారు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌లో భాగంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలనే యువజన కాంగ్రెస్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డిపిలుపు మేరకు నియోజకవర్గ అధ్యక్షుడు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలో యువజన కాంగ్రెస్ నాయకులతో క్విజ్ కాంపిటీషన్ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జులై 1 వరకు 7661899899 నెంబర్‌కు మిస్ కాల్ ఇచ్చి తమ పేరు వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. రెండో తేదీన ఆన్‌లైన్ ద్వారా క్విజ్ కాంపిటేషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. 16-35 లోపు ఉన్న యువతీ యువకులు అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా క్విజ్ కాంపిటీషన్ కు అపూర్వ స్పందన లభిస్తుందని వివరించారు. క్విజ్ కాంపిటీషన్ పైయువతకు అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీలో మొదటి బహుమతి ల్యాప్టాప్, రెండో బహుమతి మొబైల్ ఫోన్, మూడో బహుమతి ట్యాబ్, అదేవిధంగా మహిళలను ప్రోత్సహించేందుకు ప్రతి అసెంబ్లీకి ఒకరికి ఎలక్ట్రిక్ స్కూటర్ అందించడం జరుగుతుందన్నారు. వాటితోపాటు వివిధ రకాల బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ కమిటీ సభ్యులు బానోతు రాజు, మల్లికార్జున్, మహమ్మద్ జహీర్, మల్లికార్జున్, బబ్లూ నరేష్, అభిలాష్, మహమ్మద్ షాకిఫ్, రామ్ చంద్రారెడ్డి, ప్రశాంత్, సంతోష్ రెడ్డి, సురేష్, తేజ, స్వరాజ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



పారగాన్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

కార్మికులకు పారగాన్ పరిశ్రమ కనీస వేతనాలు అమలు చేయట్లేదని.. వెంటనే సదరు కంపెనీ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టు లేబర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కార్యాలయంలోని ఏసీఎల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం నరసింహారెడ్డి మాట్లాడుతూ.. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని పారగాన్ యూనిట్ 2 పరిశ్రమలో కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో యజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నదని విమర్శించారు.ఆదేవిధంగా సెక్యూరిటీ గార్డ్స్‌కు చట్ట ప్రకారం వేతనాలు చెల్లించని ప్రవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలను రద్దు చేయాలన్నారు. పారగాన్ యూనిట్ 2 పరిశ్రమలో గత అనేక ఏండ్లుగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడంలేదని, ఈఎస్ఐ, పీఎఫ్, సెలవులు లాంటి చట్టాలను అమలు చేయడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు ప్రస్తుతి సెలవులు మరియు వేతనంతో కూడిన సెలవు, క్యాంటీన్ మరియు ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. అదేవిధంగా పటాన్ చెరు పారిశ్రామిక ప్రాంతంలో పరిశ్రమలలో, వ్యాపార సంస్థలలో వేలాదిమంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారని రోజుకు 12 గంటలు పనిచేసిన ఓటి ఇవ్వకుండా, సెలవులు ఇవ్వకుండా, సెక్యూరిటీ సిబ్బందితో పని చేయించుకుంటున్నారని ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ వాళ్ళ కార్మిక చట్టాలని అమలు చేయకుండా సెక్యూరిటీ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. సెక్యూరిటీ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు శివరాజ్, శివరాజ్ ,అశోక్ రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్మెంట్ శిక్షణే లయన్స్ క్లబ్ లక్ష్యం



నవతెలంగాణ-సంగారెడ్డి

విద్యా, వైద్య, వ్యవసాయ తదితర రంగాల్లో నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అనేక వైద్య, విద్యా శిబిరాలను ఏర్పాటు ద్వారా సేవా కార్యక్రమాలను విజయవంతం చేయుటలో ప్రణా ళికలు ఏర్పరచి తద్వారా లయన్స్ క్లబ్ సేవలను మరింత దూరం విస్తరించాలని రీజియన్ చైర్మెన్ ఆశా నిమ్మగడ్డ అనారు. ఆశా గృహంలో లయన్ డిస్ట్రిక్ట్ 320 డి పరిధిలో రీజియన్ 07లోని నాలుగు జోన్ వారిని 16 లయన్స్ క్లబ్‌లో అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారులు నలుగురు జోన్ చైర్మన్‌లతో ఆశా అధ్యక్షతన శుక్రవారం రీజియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2023-24 లయనిక్ సంవత్సరంలో చేయాల్సిన కార్యక్ర మాలను రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ తరపున అధ్యక్షులు లయన్ లాడె మల్లేశం, డిస్ట్రిక్ట్ చైర్మెన్ లయన్ నాయికోటి రామప్ప, జోన్ చైర్మెన్ లయన్ గుమ్మడిదల వెంకన్న, డిస్ట్రిక్ట్ చైర్మెన్ డిచ్‌పల్లి నర్సింహా రాజులు, నాల్గో జోన్లోని లయన్స్ క్లబ్స్, శరత్ చంద్రారెడ్డి, మహిపాల్‌రెడ్డి, భీమ కిషోర్ పాల్గొన్నారు.

బడి ప్రారంభమై పదిరోజులవుతున్నా పుస్తకాలు అందలే..

- సిబ్బంది కొరతతో విద్యార్థులే అటెండర్లుగా మారిన దుస్థితి
- పాఠశాలల్లోని సమస్యలన్నింటిని పరిష్కరించాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్

నవతెలంగాణ-సదాశివపేట

పాఠశాలలు ప్రారంభమై పది రోజులు గడుస్తున్నా నేటికీ పాఠ్యపుస్తకాలు పూర్తిగా అందలేదని.. సిబ్బంది లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులే అటెండర్లుగా మారారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్ ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సదాశివపేట పట్టణం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం సర్వే చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. స్కూల్స్ ప్రారంభమై పది రోజులు గడుస్తున్నా.. సదాశివపేట మండలంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పూర్తిస్థాయిలో తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సామాన్య శాస్త్రం పాఠ్యపుస్తకాలు రాలేవన్నారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు గణితం పుస్తకాలు అందకపోవడంతో చదువుకోవడనికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి.. పుస్తకాలు ఇవ్వాలన్నారు. అలాగే అటెండర్ లేక విద్యార్థులే అటెండర్లుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు అవసరమైన సిబ్బందిని నియమించాలన్నారు. విద్యార్థులకు సరిపడా గదులు లేక చెట్ల కిందనే చదువుకోవాల్సి వస్తుందని.. వర్షాకాలం ప్రారంభం అయింది కాబట్టి నూతన భవనం పనులు త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులో తేవాలన్నారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



సీఎం హామీలు.. ఓ ఎన్నికల స్టంట్

- గత హామీలే మళ్లీ ఇచ్చారు
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి

నవతెలంగాణ-రామచంద్రాపురం

పటాన్చెరు సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలు అన్ని ఎన్నికల స్టంట్ కోసమేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి విమర్శించారు. రామచంద్రాపురం పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఎన్నికల స్టంట్‌లో భాగంగా ప్రజల కు మాయమాటలు చెబుతున్నారని.. గత హామీలే ఇంతవరకు నెరవేర్చనప్పటికీ మళ్లీ అదే హామీలు ఇవ్వడం సరికాదన్నారు. పటాన్చెరు ప్రాంతంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా వలన జాతీయ రహదారి పూర్తిగా ట్రాఫిక్ తో జామ్ అవుతున్నదని.. అందువలన మెట్రో లైన్ పటాన్చెరు వరకు వెంటనే పొడిగించి పనులు ప్రారంభించాలి కానీ బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే తదనంతరం పనులు ప్రారంభిస్తామని అనడం ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తికి సరైనది కాదన్నారు. కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో స్థానికులకు అధిక వాటా కేటాయించాలని ప్రభు త్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. రామచంద్రాపురం పట్టణంలోని రాయసముద్రం చెరువు అభివృద్ధి కోసం గతంలోనే మంత్రి హరీష్ రావు పలు మార్లు ప్రారంభోత్సవాలు చేసినప్పటికీ తొమ్మిదేండ్లు గడుస్తున్న ఇంత వరకు పూర్తికాకపోవడం శోచనీయమన్నారు. పటాన్చెరులో ఆసుపత్రి నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం 25 శాతం వాటా మాత్రమే ఇచ్చిందని ఫార్మా పరిశ్రమల వాటా నిధులతోనే ఆసుపత్రి నిర్మాణం జరుగుతున్న విషయం అందరికీ తెలుసు అన్నారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే పటాన్చెరు, ఇస్నాపూర్ వంటి ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే ఎందుకు ప్రయత్నించడం లేదన్నారు. 2014, 2018 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని మళ్లీ ఇప్పుడు ఎన్నికల సందర్భంగా కొత్త హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అంజిరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి బలరాం నాయకులు భూపాల్ రెడ్డి, మల్లేష్, రాజు, కృష్ణారెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాస్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.





ఘనంగా చింతా గోపాల్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-సదాశివపేట

బీఆర్ఎస్ నాయకుడు, మున్సిపల్ వైస్ చైర్మెన్ చింతా గోపాల్ జన్మదిన వేడుకలను శుక్రవారం స్థానిక దుర్గా ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. సదాశివపేట పట్టణ, మండల నాయకులు ప్రజాప్రతినిధులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




యువనేత అనిల్‌రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారానికి చెందిన యువ నాయకుడు అంతిరెడ్డిగారి అనిల్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేశం గౌడ్, మాజీ ఎంపీటీసీ అంతిరెడ్డిగారి శ్రీనివాస్ రెడ్డిలు శాలువాతో సత్కరించి అనిల్ రెడ్డికి జన్మదిన శుభాకాం క్షలతో ఆత్మీయ ఆశీస్సులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 3
మెదక్
శనివారం 24 జూన్ 2023



కేసీఆర్ న్యూట్రిషన్ కిట్టు అందజేత

నవతెలంగాణ-నిజాంపేట



నిజాంపేట మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో శుక్రవారం గర్భవతులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్టును అందజేశామని ఎం.ఎల్.హెచ్.పి సంధ్య తెలిపారు. గర్భిణీ స్త్రీలకు రక్తహీనతను అరికట్టడానికి న్యూట్రిషన్ కిట్టు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం బాలమణి, ఏఎన్ఎం అనురాధ , ఆశా వర్కర్ బండారి అనిత , కొమ్మట బాలమణి, గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-నిజాంపేట



సీఎంఆర్ఎఫ్ చెక్కులుపేదల పాలిట వరంలా మారాయని నిజాంపేట జడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ అన్నారు. జెడ్పీటీసీ క్యాంప్ ఆఫీస్‌లో నిజాంపేట మండలంలోని లక్ష్మీకి రూ.90 వేలు, స్రవంతికి రూ.18 వేలు, ప్రవీణ్ రూ.23 వేలు, సిద్ధరాములు రూ.42 వేలు, ఫర్జానా బేగంకు రూ.20 వేల సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చల్మేడ సర్పంచ్ నరసింహ రెడ్డి, నార్లాపూర్ ఎంపీటీసీ రాజిరెడ్డి, బీఆర్ ఎస్ నాయకులు జిపి స్వామి, ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాల వికాస ఆధ్వర్యంలో అంతర్జాతీయ వితంతువుల దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-నిజాంపేట్

నిజాంపేట మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం బాలవికాస సమస్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం సందర్భంగా ముందుగా గ్రామంలో పాఠశాల పిల్లలతో ర్యాలీ నిర్వహించి అనంతరం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలవికాస సమస్త ప్రతినిధులు మాట్లాడుతూ జూన్ 23వ తేదీని ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీ అధికారిక అంతర్జాతీయ వితంతువుల దినోత్సవంగా 2010, డిసెంబర్‌లో ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ దినేష్, పాఠశాల ఉపాధ్యాయులు, బాలవికాస గ్రామ కమిటీ సభ్యులు జీడి తిరుపతి, మల్లవ్వ శివ ఎల్లం యాదవ్, టీ పరుశురాములు, సప్తగిరి బాలవికాస ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏడుపాయల వనదుర్గ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి

- వర్షాలు సమృద్ధిగా పడాలని అమ్మవారిని కోరిన ఎమ్మెల్సీ శేరి



నవతెలంగాణ-పాపన్నపేట

ఏడుపాయల వనదుర్గ మాత అమ్మవారిని ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన ప్రాంగణంలోకి ప్రవేశించిన ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి దేవస్థానం పరిపాలన అధికారి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి దంపతుల చేత దేవస్థాన ప్రధాన అర్చకుడైన శంకర్ పంతులు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా వనదుర్గ అమ్మవారికి ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి హారతినిచ్చి దర్శనం చేసుకున్నారు. మెదక్ జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దూరం చేసి సమృద్ధిగా వర్షాలను కురిపించాలని అమ్మవారిని కోరినట్లు ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేరి నారాయణరెడ్డి సర్పంచులు మహిపాల్ రెడ్డి, శీను నాయక్ ఎంపీటీసీ దుర్గారావు మాజీ సర్పంచ్ రామచందర్ నాయక్, తదితరులు ఉన్నారు.

సరస్వతీ పుత్రులుగా తీర్చిదిద్దాలి

నవతెలంగాణ-టేక్మాల్



నూతనంగా అంగ న్వాడీలో చేరిన పిల్లలను సరస్వతీపుత్రులుగా తీర్చిదిద్దాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతి టీచ ర్లకు సూచించారు మం డల పరిధిలోని పంప్లూర్ గ్రామంలో ఐసిడిఎస్ సెంటర్లను సందర్శించి ఆమె సామూహిక అక్షరాభ్యాసాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సరోజ మల్లేశం, అంగన్వాడీ టీచర్స్, మల్లమ్మ, సుజాత, యశోద, అంగన్వాడి ఆయా, గర్భిణీ స్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి బీజేపీ



నవతెలంగాణ-వెల్దుర్తి.

మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం మాసాయిపేట్ మండల పరిధి రామంతపూర్ తండాలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పాపన్న గారి వేణుగోపాల్ ఇతర కార్యకర్తలతో కలిసి గడపగడపకు తిరిగారు. బీజేపీ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలలో నరేంద్ర మోడీ ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను పంచి ప్రజలకు వివరించారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశంలో సబ్బండ వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు రానున్న రోజుల్లో భారత ప్రధానిగా భారత ప్రధానిగా మరోమారు చూడాలని అందుకు అందరు సహకారం ఎంతో అవసరం ఉందన్నారు ఈ కార్యక్రమంలో బూత్ కమిటీ అధ్యక్షులు శీను యాదగిరి సాయిలు భాస్కర్ పాల్గొన్నారు

శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

నవతెలంగాణ-నిజాంపేట



భారతీయ జనతా వ్యవ స్థాపకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివాస్ దినోత్సవ సందర్భంగా ని జాంపేట మండల బీజేపీ అధ్యక్షులు చంద్రశేఖర్ ఆధ్వ ర్యంలో వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జాతీయవాద సిద్ధాంతాలు మతాలకు వ్యతిరేకంగా కూడా ఉండకపోవడం అన్ని మతాలు సమానమని చెప్పడం అఖండ భారత దేశ లక్ష్యంగా పని చేశారన్నారు. ఒక దేశంలో ఏక్ దేశమే ఏ విధాన్ ఏక్ నిషాన్ ఏక్ ప్రధాన్ ఉండాలని కాశ్మీర్ స్వయం ప్రతిపత్తిని ఎత్తివేయాలని నాడు కాశ్మీర్లో నిరాహార దీక్ష చేశారన్నారు. అప్పటి ప్రభుత్వం అతన్ని అరెస్టు చేసి అతని చావు కు కారణమైందన్నారు. చావు కూడా ఇప్పటికి మిస్టరీగానే మిగిలిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి, బూత్ అధ్యక్షులు గజం రాజు స్వామి, ప్రశాంత్ గౌడ్, సీనియర్ నాయకులు లక్ష్మణ్ మావురం పాల్గొన్నారు.

రెండు రోజులుగా సరఫరా రాని మిషన్ భగీరథ నీరు

నవతెలంగాణ-రేగోడు

మండల కేంద్రమైన రేగోడ్‌లో గత రెండు రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు ఇబ్బందులు పడద్దని ఉద్దేశంతో ఇంటింటికి నల్ల కలెక్షన్ ఇచ్చి మిషన్ భగీరథ ద్వారా నీటని ప్రతిరోజు సరఫరా చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవరించడంతో రేగోడు గ్రామానికి రెండు రోజులుగా మిషన్ భగీరథ నీళ్ళు సరఫరా కాకపోవడంతో నీళ్ల కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, నీళ్ల వచ్చేటప్పుడు కూడా అంతంత మాత్రమే వస్తున్నాయి. రెండు రోజులుగా నీళ్ల లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామ ప్రజలు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి నీటిని సరఫరా చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

బక్రీద్ ఏర్పాట్లపై సమీక్ష

నవ తెలంగాణ-సిద్దిపేట



బక్రీద్ పండుగ సందర్భంగా మున్సిపల్ తరపున చేయాల్సిన ఏర్పాట్లపై కమిషనర్ సంపత్ కుమార్ తన కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, ముస్లిం తంజీమ్‌లతో మైనారిటీ కౌన్సిలర్ల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మసీదులు, ఈద్గాల వద్ద శానిటేషన్ పనులు నిర్వహించాలని, హెల్ప్ లైన్ డెస్క్ ఏర్పాటుచేయాలని, త్రాగు నీరు ఏర్పాటు చేయాలని సానిటరీ ఇన్స్పెక్టర్‌ని ఆదేశించారు. కుర్బానీ చేసిన అనంతరం వ్యర్థాలను మున్సిపల్ వాహనాల ద్వారా తరలించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు రియాజుద్దీన్, తాడూరి సాయి ఈశ్వర్ గౌడ్ , ప్రజాప్రతినిధులు వజీరుద్దీన్, మొయిజ్ , కో ఆప్షన్ సభ్యులు సయిూద్, తంజీమ్ మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పోతరాజ్‌పల్లి కమాన్ వద్ద ఐల్యాండ్

- తూప్రాన్ మున్సిపల్ సాధారణ సమావేశంలో పలు తీర్మాణాలు చేసిన చైర్మన్

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరబాద్)

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పోతరాజ్‌పల్లి కమాన్ వద్ద ఐల్యాండ్ ఏర్పాటుతో పాటు జంక్షన్ బ్యూటిఫికేషన్ చేపట్టేందుకు తీర్మాణం చేసినట్టు మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవెందర్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవెందర్‌గౌడ్ అధ్యక్షతన కమీషనర్ మోహన్ మున్సిపల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి గజ్వెల్ నియోజక వర్గ



గడ ప్రత్యేక అధికారి ముఖ్యఅథిధిగా హజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో అభివృద్ధి బ్యూటిఫికేషన్‌పై పలు తీర్మాణాలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని పోతరాజ్‌పల్లి కమాన్ వద్ద ఐల్యాండ్ ఏర్పాటుతో పాటు జంక్షన్ బ్యూటిఫికేషన్ చేపట్టనున్నారు. మున్సిపల్ కేంద్రంలోని బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద మినార్, వాటర్ ఫౌంటేయిన్, క్లాక్ టవర్, జంక్షన్ బ్యూటిఫికేషన్ చేయడంతో పాటు, వినాయక్ నగర్ వీధిలో ఎల్ షేప్ పోల్స్, వీధి దీపాల ఏర్పాటు, అలాగే మున్సిపల్‌లోని ప్రతి వీధిలో అహ్లాదకర వాతావరణం ఏర్పాటు దిశగా మొక్కలు నాటేందుకు కావాల్సిన టాల్ ప్లాంట్స్, ఫ్లవర్ ప్లాంట్స్ ఏర్పాటు చేసుకోవడానికి పలు తీర్మాణాలు చేయగా పాలక వర్గం ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, మున్సిపల్ ఏఈ సాయిరాంరెడ్డిలతో పాటు పాలక వర్గ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తిగా మినీ ట్యాంక్ బండ్

- ఏడేళ్లుగా ముందుకు సాగని పనులు
- నిరుపయోగంగా బోట్
- మెదక్ జిల్లాపై మంత్రి, ఎమ్మెల్యే శీతకన్ను
- అధికార పార్టీ నాయకుల తీరుపై ధ్వజమెత్తిన కాంగ్రెస్ శ్రేణులు

నవతెలంగాణ-మెదక్

మెదక్ జిల్లా కేంద్రం అభివృద్ధికి ఆమడ దూరంలో కొట్టుమిట్టాడుతోందని, ఏడేళ్లుగా మిని ట్యాంక్ బండ్ పనులు అసంపూర్తిగానే ఉన్నాయని కాంగ్రెస్ శ్రేణులు మండిపడ్డారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని గోసంద్రం, పిట్లం చెరువులను సందర్శించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హఫీజ్ మోల్ సబ్, అశోక్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా మెదక్ ఏర్పాటు అయినప్పటికీ అభివృద్ధిలో మాత్రం వెనుకంజలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ పట్టణ అభివృద్ధిపై జిల్లా మంత్రి, ఎమ్మెల్యే సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని విమర్శించారు. 2016 మార్చి 14 న స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రి మిషన్ కాకతీయలో భాగంగా మెదక్ పట్టణంలోని గోసంద్రము, పిట్లం చెరువును మినీ ట్యాంక్ బండ్ గా మార్చటానికి రూ. 9.50 కోట్ల నిధులు కేటాయిస్తూ శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఏడేళ్ల పూర్తి అయినా ట్యాంకు బండ్ నిర్మాణం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉందని మండిపడ్డారు. మెదక్‌తో పాటు సిద్దిపేటలో శంకుస్థాపన చేసిన కోమటి చెరువులో ప్రస్తుతం బోటింగ్, లైటింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్, గార్డెన్ తో కళకళలాడుతుందనీ



గుర్తు చేశారు. మెదక్ మినీ ట్యాంక్ బండ్ కోసం ఇటీవల రూ. 11 కోట్లను మంజూరు చేస్తున్నట్లు మంత్రి కేవలం నోటి మాట మీద చెప్పడం జరిగిందని, ఆచరణలో మాత్రం ఎలాంటి పనులు ప్రారంభం కాలేదని ఎద్దేవా చేశారు. అదేవిధంగా బోటింగ్‌ను పేరుకు మాత్రం ప్రారంభించి వదిలేశారన్నారు. బోట్ నిరుపయోగంగా ఉండటంతో ప్రజలకు ఏలాంటి ఉపయోగం లేకుండా పోయిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రజలు గమనించి ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు నవీన్ చౌదరి, దుర్గేష్, జకర్యా తదితరులు పాల్గొన్నారు.

జిఎంఆర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ మనోహరాబాద్

విద్యార్థులకు చిన్ననాటి నుంచే చదువులపై ఆసక్తిని పెంచే విధంగా కార్యక్రమాలను జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్టు జిఎంఆర్ పోచంపల్లి ఎక్స్ప్రెస్ వేస్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో జి.యం.ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యమానికి జి.యం.ఆర్ పోచంపల్లి ఎక్స్ప్రెస్ హైవే సంస్థ ప్రతినిధులు వెంకటరమణ, ప్రవీణ్ కుమార్, లక్ష్మణ్ రావు, సతీష్ పట్నాయక్ ముఖ్య అతిధులుగా విచ్చేసి సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షరాభ్యాస కార్యక్రమంలో భాగంగా చదువుల తల్లి సరస్వతి మాత పూజ నిర్వహించి, ఒకటవ తరగతిలోకి నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులచే అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ మాట్లడుతూ ప్రతి సంవత్సరం జూన్ మాసంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలో జి.యం.ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాసర సరస్వతి మాత పూజ నిర్వహించి నూతనంగా చేరిన చిన్నారులకు పలకలు అందించి అక్షరాలు దిద్దించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంధ్యారాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని కనుల పండుగగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జి.యం.ఆర్ సంస్థ ప్రతినిధులు వెంకటరమణ , ప్రవీణ్ కుమార్, లక్ష్మణ్ రావు, సతీష్ పట్నాయక్, పాఠశాల



మహిళా ఉపాధ్యాయులు సంధ్యారాణి, పద్మావతి, సునీత, జ్యోతి, ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్, వాలంటీర్స్ జ్యోతి, పోచలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

గౌడ జాతి హక్కుల కోసం కృషి చేయాలి

నవతెలంగాణ-టేక్మాల్

గౌడ జాతి హక్కుల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి భార్గవ్ రామ గౌడ్, అందోల్ నియోజకవర్గ గౌడ సంఘం నాయకులు సంగమేశ్వర్ గౌడ్‌లు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం మండల అధ్యక్షుడు కోటగిరి భూమా గౌడ్ అధ్యక్షతన మండల స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా వారు పాల్గొని మాట్లాడారు. గౌడ జాతి హక్కులు, వాటి పరిరక్షణ కోసం మనమందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాలను గౌడన్నలకు అందించాలని కోరారు. గౌడన్నలు తమ కులవృత్తులను నమ్ముకొని ఎంతోమంది ప్రాణాలను కోల్పోయారని వారి కుటుంబాలకు సరైన న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం యూత్ నాయకులు అనిల్ గౌడ్, మోకు దెబ్బ వికారాబాద్ జిల్లా యూత్ అధ్యక్షుడు హరిదాస్ గౌడ్, మోకు దెబ్బ గౌడ సంఘం టేక్మాల్ గ్రామ అధ్యక్షుడు సాయి శేషు గౌడ్, తంప్లూర్ గ్రామ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్,కాదులూర్ గ్రామ అధ్యక్షులు రామకృష్ణ గౌడ్, టేక్మాల్ గ్రామ యూత్ అధ్యక్షుడు నరేష్ గౌడ్,వివిధ గ్రామాల గౌడ సంఘం నాయకులు సదాశివ గౌడ్,శేఖర్ గౌడ్, మురళి గౌడ్,మహేందర్ గౌడ్,వెంకట్ గౌడ్,సాయి గౌడ్,నారాయణ గౌడ్, అంజ గౌడ్,



రామలింగం గౌడ్, శంకర్ గౌడ్, మల్లేష్ గౌడ్, రాజు గౌడ్ పాల్గొన్నారు.

సమావేశానికి బీఆర్ఎస్ నాయకులే ఆహ్వానితులా? ఇతర పార్టీల వారు కాదా?

- డీసీసీ నాయకులు యాదగిరి యాదవ్

నవతెలంగాణ- నార్సింగి

మండల సర్వసభ్య సమావేశానికి బీఆర్ఎస్ నాయకులే ఆహ్వానితులా అని ఇతర పార్టీల వారు కాదా అని డీసీసీ నాయకులు యాదగిరి యాదవ్ ప్రశ్నించారు. మండల కేంద్రంలో శుక్రవారం మెదక్ జిల్లా కాంగ్రెస్ డీసీసీ నాయకులు యాదగిరి యాదవ్ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ప్రోటోకాల్ ప్రకారంగా ఎంపీపీ, జెడ్పీటీసీ, వివిధ శాఖల అధికారులు, మండలం వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావలసి ఉంటుందన్నారు. కానీ నార్సింగిలో ప్రోటోకాల్ లేని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుమ్మరి బాబు, మాజీ, పిఎసిఎస్ చైర్మన్ తౌర్య నాయక్, పి.ఎస్.సి.ఎస్ డైరెక్టర్ బిక్యా నాయక్‌లు సమావేశానికి హాజరయ్యారని ఆయన తెలిపారు. అధికార పార్టీ నాయకులు మాత్రమే ఆహ్వానితులా మిగిలిన మండల పార్టీ నాయకులు ఆహ్వానితులు కాదా



అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులను సమావేశానికి ప్రోటోకాల్ లేకుండా ఎందుకు ఆహ్వానించారనీ, మిగిలిన పార్టీ నాయకులను ఎందుకు ఆహ్వానించలేదో తెలుపాలని, సభ అధ్యక్షురాలు ఎంపీపీ సబిత, ఎంపీడీవో ఆనంద్ మేరీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం అధికార పార్టీ నాయకులు మాత్రమే కార్యకలాపాలలో పాల్గొనాలా మిగతా నాయకులు పాల్గొనకూడదా అని వారు



ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు ఒక న్యాయం , మిగతా పార్టీలకు ఒక న్యాయమా, వెంటనే ఈ విషయంపై ఎంపీపీ, ఎంపీడీవో వివరణ ఇవ్వాలని లేదంటే ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని యాదగిరి యాదవ్ తెలిపారు.

వితంతువులు ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలి

నవతెలంగాణ-జగదేవపూర్: వితంతువులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని అలిరాజ్ పేట సర్పంచ్ లక్ష్మీ చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల మహిళ విభాగం అధ్యక్షురాలు, ఎంపిటిసి కవిత శ్రీనివాస్ రెడ్డిలు సూచించారు. అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం సందర్భంగా ఎస్ సీ వీ రోస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వితంతువులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వితంతువులు మనోధైర్యం కోల్పోవద్దని, సాధికారత వైపు అడుగులు వేయాలని సూచించారు. అలాగే మూఢ నమ్మకాల ముసుగులో భవిష్యత్ నాశనం చేసుకోవద్దని, మూఢ నమ్మకాలను నమ్మవద్దని కోరారు. సమాజంలో వితంతువులు సమానమేనని, వారి హక్కుల సాధనకు అడుగు ముందుకు వేయాలన్నారు. సమాజంలో వితంతువులను చిన్నచూపు చూడొద్దని, మూఢచారాల పేరిట ఇబ్బందులకు గురి కావద్దని సూచించారు. సంస్థ ఆధ్వర్యంలో వితంతువుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సవిత సిస్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చంటి, ఉప సర్పంచ్ రమేష్, సంస్థ సిబ్బంది శ్వేత, స్వాతి, వితంతువులు పాల్గొన్నారు.

సిద్దిపేటరూరల్ : వితంతువుల మహిళలపై వివక్షత



చూడవద్దని బాలవికాస మహిళ కోఆర్డినేటర్ లక్ష్మీ అన్నారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో జూన్ 23 అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం సందర్భంగా బాలవికాస మహిళా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిపి వితంతువుల వివక్షతపై గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాలవికాస మహిళ కోఆర్డినేటర్ లక్ష్మి మాట్లాడుతూ బాలవికాస సమస్త ఆధ్వర్యంలో వితంతువులపై వివక్షత విడనాడాలని వారిని సమాజంలో తోటి మహిళలతో సమానంగా చూడాలని మూఢనమ్మకాలు నమ్మ వద్దని చిన్న వయసులో భర్తను కోల్పోయిన వితంతులను , పునర్వివాహాలు చేసుకునే విధ



ంగా ప్రోత్సహించి వారికి అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి , ఉపాధ్యాయులు మహిళలు విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు

హుస్నాబాద్ రూరల్ : వితంతువులపై వివక్ష వద్దని హుస్నాబాద్ మాజీ సర్పంచ్ బాలవికాస వాటర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేడం లింగమూర్తి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ మండలంలోని తోటపల్లి గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా బాలవికాస వాటర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేడం లింగమూర్తి మాట్లాడుతూ ఆడవారికి చిన్న వయసులో భర్త చనిపోతే వీలైతే వారికి మళ్ళీ పెళ్లి చేయాలని కోరారు. భర్త చనిపోతే శుభకార్యాలకు



దూరం పెట్టడం, సమాజం చిన్నచూపు చూసి మనోవేదనను గురి చేస్తుంటారన్నారు. వితంతువులకు చేదోడువాదోడుగా ఉంటూ వారికి మనోధైర్యం నింపాల్సిన బాధ్యత ప్రతి మహిళ పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ సుంకే రాజశేఖర్, కోఆర్డినేటర్లు జ్యోతి, శ్రీమతి, నిర్మల అధ్యక్షురాలు కవిత స్వప్న ,లక్ష్మి మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మద్దూరు : మద్దూరు మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉన్నట్లు, మద్దూరు ఏఈ సుధీర్ బాబు శుక్రవారం విలేకరులకు తెలిపారు.ముస్త్యాల 11 కెవి సబ్ స్టేషన్‌లో, విద్యుత్ మరమ్మతులు ఉన్నందున మద్దూరు మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఉన్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఫర్టిలైజర్ షాపులో ఆకస్మిక తనిఖీలు.

నవతెలంగాణ-బెజ్జంకి : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపుల్లో ఎఓ సంతోష్‌తో కలిసి ఎస్ఐ ప్రవీణ్ రాజు శుక్రవారం ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైతుల అవసరాలను అసరా చేసుకుని ఫర్టిలైజర్ షాపుల యజమానులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు చేపట్టి కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ ప్రవీణ్ రాజు హెచ్చరించారు.



త్వరలోనే సర్దార్ పాపన్న ఫంక్షన్ హాల్ పనులు

గౌడ సంఘం అభివృద్ధికి కృషి-రమేష్ గౌడ్

నవతెలంగాణ-దుబ్బాక



దుబ్బాక పురపాలిక పరిధిలోని ధర్మాజీపేట వార్డులో సర్దార్ పాపన్న గౌడ్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను గౌడ కులస్తుల సహకారంతో త్వరలోనే ప్రారంభిస్తామని సంఘం అధ్యక్షుడు కర్ణంపల్లి రమేష్ గౌడ్ తెలిపారు. గౌడ కులస్తుల అభివృద్ధి కోసం తనవంతుగా కృషి చేస్తున్నానని, అందులో భాగంగానే 1000 ఈత చెట్లను నాటడం జరిగిందన్నారు. సంఘ సభ్యుల సహకారంతో త్వరలోనే సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు చేపడతున్నట్లు తెలిపారు.



పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం

నవతెలంగాణ-తొగుట

పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశామని ప్రధానోపాధ్యాయురాలు సుజాత తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం మన ఊరు-మన బడి కార్యక్రమంలో పాఠ శాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించిందని తెలిపారు.వాటితో కొంత వరకు పాఠశాలను అభివృద్ధి చేశామన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ పాతుకుల లీలదేవి వెంకటేశం ఎస్ఎంసి చైర్మన్ కంకణాల అర్చన ఆంజనేయులు, ఉప సర్పంచ్ బండకాడి గణేశ్, విద్యార్థుల తల్లి దండ్రులు కల్లెపు రాజు, చందు, ఎంగలి లక్ష్మణ్, వడ్డే రాజు, వడ్డే నర్సింలు, జహంగీర్, యువకులు జహం గీర్, శివ కోటి, యాదగిరి, ఎంగలి నరేందర్ తదితర లు పాల్గొన్నారు.



రైతు బంధు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం జనగామ గ్రామ క్లస్టర్ పరిధిలో ఉండే రైతులు రైతు బంధుకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ శ్రీలత తెలిపారు. 16-06- 2023 వరకు కొత్తగా పట్టా పాస్ బుక్కులు వచ్చిన రైతులందరూ తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జూన్ 26వ తేదీ లోగా చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారు రైతుబంధు అప్లికేషన్ ఫారం నింపి, పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్సులు జనగామ రైతు వేదిక వద్ద అందించాలని కోరారు.



గౌరవెల్లి డ్యాం పూర్తైంది.. రోడ్డు పాడైంది

- తారు రోడ్డు కావాలి సార్
- గుంత రోడ్డుతో ప్రజల ఇబ్బందులు
- డబుల్ రోడ్డు వేయించాలని ఆవేదన

నవతెలంగాణ-అక్కన్నపేట

తెలంగాణ రాష్ట్రంలో గౌరవెల్లి ప్రాజెక్టు అంటే ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఎన్నో అపసోపాల మధ్య చివరికి ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టును ప్రారంభించబోతున్నారు. ఇప్పటికే ప్రాజెక్టు కోసం ఎంతోమంది నిర్వాసితులు వారి భూములను, సర్వస్వాన్ని త్యాగం చేశారు. అంతేకాకుండా గౌరవెల్లికి సంబంధించిన గ్రామస్తులు కూడా ఎన్ని సమస్యలు ఎదురైనా ప్రాజెక్టు పనులకు అడ్డుపడకుండా సహకారాన్ని అందించారు. ఇంత చేసినా ఈ ప్రాంత ప్రజలపై నాయకులు, అధికారులు దయ చూపడం లేదు. పూర్తి వివరాల్లోకి వెళితే.. అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 8.23 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు పనుల కోసం గౌరవెల్లి గ్రామం గుండా గత కొన్ని సంవత్సరాలుగా పెద్ద పెద్ద వాహనాలు ప్రయాణం చేశాయి. ఈ తరుణంలోనే హుస్నాబాద్ నుంచి ప్రాజెక్టు వరకు ఉన్న రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది పెద్ద పెద్ద గుంతలతో ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తోంది. అయితే ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత డబుల్ రోడ్డు వస్తుందని అధికారులు ప్రజా ప్రతినిధులు అన్నారు. కానీ ప్రాజెక్టు పూర్తయినా, ఇప్పటికీ రోడ్డు గురించి ఏ అధికారి స్పందించడం లేదు. ప్రతిరోజు గ్రామ ప్రజలు దుమ్ముతో అనేక ఇక్కట్లు పడుతున్నారు. రాబోయేది వానకాలం పెద్ద పెద్ద గుంతల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వెంటనే అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి డబుల్ రోడ్డు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదం జరిగేదాకా రోడ్డు రాదా



ప్రాజెక్టు పనుల కోసం గౌరవెల్లి రోడ్డుపై కొన్ని సంవత్సరాలుగా పెద్దపెద్ద వాహనాలు నడిచాయి. దీంతో రోడ్డు మొత్తం ధ్వంసం అయింది. ప్రాజెక్టు పనులు పూర్తయినా కానీ రోడ్డు గురించి పట్టించుకోవడం లేదు. పెద్దపెద్ద గుంతలు పడింది. గౌరవెల్లి వాగు వద్ద ఉన్న బ్రిడ్జి పూర్తిగా నాశనమైంది. ఎప్పుడు కూలుతుందో తెలియదు. ప్రమాదం జరగకముందే డబుల్ రోడ్డు మంజూరు చేయాలని కోరుతున్నాం.

పాంద్రాల దాము
అక్కన్నపేట యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు

రోడ్డు తప్పకుండా వస్తుంది



సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి కావడం సంతోషదాయకం. కానీ ప్రాజెక్టు వల్ల గౌరవెల్లి రోడ్డు పూర్తిగా నాశనం అయింది నిజమే. రోడ్డు వేయించడం కోసం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తాం. ఇప్పటికే ఎమ్మెల్యే సతీష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లాం. తప్పకుండా మనకు రోడ్డు వస్తుంది.

భైరగాని శ్రీనివాస్
బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు

బ్రిడ్జి కూలితే కానీ స్పందించరా?





అత్యధిక బరువున్న ట్రక్కులు ఈ రోడ్డుపై నడవడం వల్ల గౌరవెల్లి గ్రామ ఎల్లమ్మ గుడి వద్ద ఉన్న బ్రిడ్జి పూర్తిగా నాశనం అయింది. బీటలు వారి పోయింది. ఎప్పుడు కులుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. బ్రిడ్జి కూలి ఎవరి ప్రాణాలైనా పోతే కానీ, అధికారులు పట్టించుకోరా.. వెంటనే బ్రిడ్జి నిర్మాణంతో, పాటు డబుల్ రోడ్డు వేయాలి.

గోపగోని అరవింద్
బీజేవైఎం ప్రధాన కార్యదర్శి

రోడ్డు ప్రపోజల్ పెట్టాం

అత్యధిక బరువున్న వెహికల్స్ నడవడం వల్ల రోడ్డు పాడయింది.. డ్యాం పనులు పూర్తి అయ్యాక తప్పనిసరిగా రోడ్డు వస్తుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన రోడ్డు కోసం ప్రపోజల్ పెట్టాం. మంజూరు అయిన వెంటనే రోడ్డు వస్తుంది..

రామకృష్ణ, ఆర్అండ్ బీ డీఈ

పంట పొలాలను పరిశీలించిన ఏవో

నవతెలంగాణ-మద్దూరు



పంట సాగులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మద్దూరు ఏవో రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా మండలం లోని మర్మాముల గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రుతుపవనాలు ప్రవేశించడంతో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయని ,ఈ సమయంలో రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు, వరి వేసే రైతులు నారుమడి ఎంచుకునేటప్పుడు దీర్ఘకాలిక లేదా స్వల్పకాలిక రకాల మాత్రమే ఎంచుకోవాలని ఆయన కోరారు, కే ఎస్ ఎం 118, మీ టు 1010, జె జి ఎల్ 24423 లాంటి వరి విత్తనాలు వేసుకోవాలని ఆయన కోరారు, పత్తి పంటలో తేలిక నేలను 50 నుండి 60 ఎంఎం, బరువైన నేలల్లో 60 నుండి 70 ఎంఎం వర్షాపాతం నమోదైన తర్వాతనే పత్తి విత్తనాలు వేసుకోవాలని ఆయన కోరారు, పత్తి విత్తనాలు జూలై 15 వరకు వేసుకోవచ్చని ఆయన తెలిపారు, పత్తిలో అంతర్ పంటగా కంది కూడా వేసుకోవచ్చని కంది పంటకు ఆగస్టు 15 వరకు వేసుకోవచ్చని ఆయన కోరారు ,పంటల సాగులో రైతులు తగు సూచనలు తీసుకొని పాటించాలని ఆయన కోరారు,

దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు ఇవ్వాలి

నవతెలంగాణ -గజ్వేల్



దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు ఇవ్వాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో శంకర్ ఎడ్యుకేషన్ హబ్‌ను సందర్శించారు ప్రభుత్వ సంక్షేమ, గురుకుల, ఎస్.యం.హెచ్,కస్తూర్బా, మోడల్ హస్టళ్ళలో చదువుకోవడానికి దరఖాస్తు చేసుకుంటే సీట్లు లేవని నిరాకరించడం తగదన్నారు. పట్టణాలలో వున్న విద్యాలయాలకు చదువుకోవడానికి వస్తున్న గ్రామీణ విద్యార్థులు వసతి పొందడం హక్కుగా అమలు చేయాలన్నారు. వసతిని నిరాకరించడం వల్ల విద్యార్థులు డ్రాపౌట్‌లుగా మారే ప్రమాదం వుందన్నారు. శంకర్ వెంట డిబిఎఫ్ నాయకులు గొర్రె స్వామి తదితరులు వున్నారు.

మంద కృష్ణ మాదిగ సభకు తరలి రావాలి



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శక్తి గార్డెన్స్‌లో ఈ నెల 25వ తేదిన జరిగే మాదిగ మహాసభను జయప్రదం చేయాలని ఎం ఎస్ పి జిల్లా ఇన్చార్జి లింగంపల్లి శ్రీనివాస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పెరిక పరుశరాములు కోరారు. ఈ సభకు మందకృష్ణ మాదిగ వస్తున్నందున మాదిగ, ఉప కులాల ప్రజలు, మహా జనులు, ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గ కో ఇన్చార్జ్ కొలిమి మల్లేశం, నాయకులు సుందు స్వామి, కొత్తపల్లి కనకయ్య, లింగం పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తూ సమస్యలు తీర్చుకుందాం

- ఇంచార్జ్ ఎంపీపీ దేవి రవీందర్
- కొండపాక మండల సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-కొండపాక

అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేద్దామని కొండపాక మండల వైస్ ఎంపీపీ దేవి రవీందర్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో రవీందర్ అధ్యక్షతన కొండపాక మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లో మిగిలిన సమస్యల కోసం అంతా కలిసి పరిష్కారం కోసం పాటుపడాలన్నారు. గత ప్రభుత్వ కాలంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండేటివని తాగునీటి కోసం పడ్డ ఇక్కట్లు వర్ణనాతీతమన్నారు. తెలంగాణ రాకముందు గ్రామాల్లో నీటి కోసం ఖాళీ బిందెలతో పెద్ద ఎత్తున ధర్నాలు చేశామన్నారు. కానీ ప్రస్తుత రోజుల్లో సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో ఇంటింటికి తాగునీరు అందించి కష్టాలన్నింటిని తీర్చాడన్నారు. ప్రభుత్వ భూములను కాపాడడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సాయిబాబా ఆరోపించారు. తహసిల్దార్ పట్టించుకోవడంలేదని సభలో నిలదీశారు. జప్తి నాచారం గ్రామంలో ప్రభుత్వ భూమిలో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు తమదే పట్టానని ఆక్రమించుకున్నారని ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిలపై దాడులు జరుగుతున్నా అర్థం చేసుకోవడం లేదన్నారు. డబ్బులు ఇస్తేనే పనులు చేస్తున్నారని ఆరోపించారు. మన ఊరు మనబడి కార్యక్రమం కింద చేపట్టిన పనులకు ఇంతవరకు డబ్బులు అందలేదని సిరిసినగండ్ల గ్రామ సర్పంచ్ లక్ష్మారెడ్డి అన్నారు. బొప్పాయిపల్లి గ్రామంలో ఇనుప స్తంభాలను తొలగించి సిమెంటు స్తంభాలను వేయాలని కోరారు. అవసరమైన వారు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని తహసిల్దార్ రామేశ్వర్ తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసినప్పుడు వాటిని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంరెడ్డి, కుకునూరుపల్లి తహసిల్దార్ ఆశాజ్యోతి, ఎంపీటీసీలు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విత్తన విక్రయ దుకాణాల్లో అధికారుల తనిఖీలు

- కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవు
- కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందులు, విడి విత్తనాలు స్వాధీనం










నవతెలంగాణ-కోహెడ

రైతులకు సీడ్స్, ఫర్టిలైజర్ షాపుల యజమానులు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని ఎస్సై నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు కోహెడ ఎస్సై నరేందర్‌రెడ్డి సిబ్బందితో కలిసి శుక్రవారం మండల కేంద్రంలోని సీడ్స్, ఫర్టిలైజర్ షాపులలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిష్టర్, డెలివరీ రిజిష్టర్, బిల్లు బుక్‌లు తదితర రికార్డులను పరిశీలించారు. షాపులలో ఎలాంటి నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు లేవని ఎస్సై తెలిపారు. రైతులకు నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు అమ్మేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తరచుగా షాపులను తనిఖీ చేయడం జరుగుతుందని, రైతులను మోసం చేయాలని చూసే షాపు యజమానులపై కఠినంగా వ్యవహరిస్తామని, రైతులు కూడా అప్రమత్తంగా ఉండి వ్యవసాయ అధికారులు సూచనలతో విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు ఉన్నట్లు ఎవరైనా అమ్ముతున్నట్లు సమాచారం వస్తే వెంటనే సిదిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100 కు సమాచారం అందించాలని సూచించారు.

దౌల్తాబాద్ :

సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన దౌల్తాబాద్ లో సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాపులలో టాస్క్ ఫోర్స్ సీఐ రమేష్, టాస్క్ ఫోర్స్, సిసిఎస్ సిబ్బంది శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, బిల్ బుక్, తదితర రికార్డ్స్ తనిఖీ చేసి షాప్‌లో ఉన్న సీడ్స్, ఫర్టిలైజర్ పరిశీలించారు. కాలం చెల్లిన విత్తనాల ప్యాకెట్లు, పురుగు మందులు, విడి విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాలం చెల్లిన వివిధ రకాల విత్తనాల 75 ప్యాకెట్లు. వివిధ రకాల కాలం చెల్లిన 60 లీటర్లు, 55 కేజీల పౌడర్ పురుగుమందులను, వివిధ రకాల విడి విత్తనాలు 75 కిలోలు స్వాధీనం చేసుకొని దౌల్తాబాద్ అగ్రికల్చర్ అధికారి గోవింద్ రాజుకు అప్పగించారు. టాస్క్ ఫోర్స్ సీఐ రమేష్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు కాలం చెల్లిన విత్తనాలు, కాలం చెల్లిన పురుగుమందులు, నకిలీ పురుగు మందులు అమ్మే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో విడి విత్తనాలు, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు, కాలం చెల్లిన పురుగుమందులు తెలిస్తే సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100 కు సమాచారం అందించాలని సూచించారు.

మిరుదొడ్డి :

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాధికారి మల్లేశం, సీఐ శ్రీధర్ గౌడ్ అన్నారు. రైతులను మోసం చేసే విధంగా దుకాణదారులు వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులు విత్తన దుకాణాల్లోని రికార్డులను వ్యవసాధికారి మల్లేశం, సీఐ శ్రీధర్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు ప్రభుత్వ అనుమతులు పొందిన దుకాణాల్లోనే విత్తనాలు ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా నకిలీ విత్తనాలను విక్రయిస్తే రైతులు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. దుకాణదారులు నకిలీ విత్తనాలు ఎరువులు అవిక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులు, విత్తనాలను విక్రయించాలని దుకాణదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లోహిత్ పలువురు పాల్గొన్నారు.

అక్కన్నపేట :

అక్కన్నపేట మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను హుస్నాబాద్ సిఐ ఎర్రల్ల కిరణ్, అక్కన్నపెట ఎస్సై తాండ్ర వివేక్, వ్యవసాయ శాఖ అక్కన్నపేట క్లస్టర్ ఏఈఓ సబిహ శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేయవద్దని సూచించారు. తప్పనిసరిగా దుకాణాల్లో అమ్మే విత్తనాలకు సంబంధించిన అన్ని వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మే వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మర్కుక్:

కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని, కల్తీ విత్తనాలు అమ్మిన కొన్నవారికి విత్తన చట్టం 1966 ప్రకారం కఠిన చర్యలు తప్పవని మర్కుక్ ఎస్ఐ హరీశ్, మండల వ్యవసాయాదికారి డా.టి.నాగేందర్ రెడ్డిలు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రమైన మర్కుక్‌లో పలు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తన దుకాణదారులు ప్రభుత్వం సూచించిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అమ్మాలని, అంతేకాకుండా ఎక్కువ ధరలకు పత్తి విత్తనాలను రైతులకు అమ్మినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు కానిస్టేబుల్ నర్సింలు, దుకాణ యాజమానులు,తదితరులున్నారు.

తొగుట :

ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు అమ్మినచో కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి మోహన్, ఎస్ఐ కరుణాకర్ రెడ్డిలు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో విత్తన దుకాణాలలో తనిఖీలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డీలర్‌లు రైతులకు నాణ్యమైన విత్తనాలు అమ్మాలని, రశీదులు విధిగా రైతులకు ఇవ్వాలని సూచించారు. డీలర్‌లు రైతులకు ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు అమ్మినచో విత్తన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిదంగా రైతులు విధిగా రశీదులు తీసుకొని వాటిని పంట కాలం అయ్యే వరకు భద్ర పరుచు కోవాలని కోరారు.

నంగునూరు:

రైతు విక్రయ కేంద్రాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని రాజగోపాల్ పేట ఎస్ఐ రాజుగౌడ్ హెచ్చరించారు. శుక్రవారం నంగునూరు మండలంలో ఎనిమిది సీడ్స్ షాపులను రాజగోపాల్ పేట పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. విక్రయ కేంద్రంలో ఉన్న రిజిస్టర్లను, మందులు, విత్తనాలు పరిశీలించారు. అమ్మిన ప్రతిదానికి బిల్లు చెల్లించాలని నిర్వాహకులను కోరారు. కల్తీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.హెడ్ కానిస్టేబుల్ రంగారెడ్డి, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు :

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిన్నకోడూరు ఎస్ఐ శివానందం విత్తన వ్యాపారులను హెచ్చరించారు. చిన్నకోడూరు మండల పరిధిలోని విత్తన విక్రయ దుకాణాల్లో చిన్నకోడూరు ఎస్ఐ శివానందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

విద్యార్థులకు ఉచిత బస్సు పాస్ సౌకర్యం



నవతెలంగాణ-నంగునూరు

ఆర్టీసీ కల్పిస్తున్న ఉచిత బస్సు పాస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డిలు తెలిపారు. శుక్రవారం నంగునూరు మండలం అక్కెనపల్లి మాడల్ స్కూల్ విద్యార్థులకు మాజి ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి ఆర్థిక సహాయంతో బస్సు పాసులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏడవ తరగతి వరకు బాలురకు, పదో తరగతి వరకు బాలికలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు.ప్రభుత్వం విద్యార్థులకోసం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానంలో నిలవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవీందర్ గౌడ్, గ్రామ సర్పంచ్ శ్రీమంతుల వెంకటేశం, ఎంపీటీసీ బెదురు తిరుపతి, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దిపడగ కిష్టారెడ్డి, నంగునూరు సొసైటి కోల రమేష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రంగు రాజు గౌడ్, బత్తుల తిరుపతి, ఆర్టీసీ సిబ్బంది సత్యనారాయణ, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో డబ్బుల వ్యవస్థ లేకుంటే కమ్యూనిస్టులే గెలుస్తారు

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సిహెచ్. రాజారెడ్డి



నవతెలంగాణ-చేర్యాల:

ఎన్నికల్లో డబ్బుల వ్యవస్థ లేకుంటే కమ్యూనిస్టులే గెలుస్తారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, జనగామ మాజీ ఎమ్మెల్యే సీహెచ్. రాజారెడ్డి అన్నారు. చేర్యాల మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సీపీఐ జనగామ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నియోజకవర్గ సహాయ కార్యదర్శి అందె అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి రాజారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాజకీయాన్ని వ్యాపారంగా మార్చి సొంత ప్రయోజనాల కోసం ఎన్నికల్లో కోట్లు ఖర్చుపెట్టి ప్రజలను మోసం చేయడాన్ని సీపీఐ వ్యతిరేకిస్తుందన్నారు. నిజాయితీగా, స్వచ్ఛందంగా ప్రజలు ఓటింగ్‌లో పాల్గొంటే ప్రజలకు సేవ చేసే కమ్యూనిస్టులే గెలుస్తారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో థామాషా ఎన్నికల విధానాన్ని అమలు జరిపితే చట్టసభలన్నింటిలో కమ్యూనిస్టులు గెలిచి తీరుతారని దీన్ని ఎవరు ఆపలేరన్నారు.జనగామ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి, స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, ఇంతకాలం ఎమ్మెల్యే స్వప్రయోజనాల కోసం పనిచేశారని ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని బహిరంగంగా బీఆర్ఎస్ పార్టీ కిందిస్థాయి కార్యకర్తలే విమర్శిస్తున్నారన్నారు. దేశంలో బీజేపీని తరిమికొట్టకపోతే ఈ దేశానికి రక్షణ లేకుండా పోతుందని, రైతు, కార్మికుల జీవితాలు అదోగతి పాలవుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో అదాని లాంటి బడా పెట్టుబడిదారులకు కట్టబెడుతూ ఈ దేశాన్ని అధోగతి పాలు చేస్తుందని విమర్శించారు. మతోన్మాద కార్పొరేట్ బీజేపీకి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలన్నారు. భవిష్యత్తులో సీపీఐని చేర్యాల ప్రాంతంలో మరింత బలోపేతం చేసి ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పాతూరి సుగుణమ్మ, ఆది సాయన్న, నియోజకవర్గ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు మంగళంపల్లి జనార్ధన్, జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, మండలాల కార్యదర్శులు కుడిక్యాల బాల్ మోహన్, వలబోజు నరసింహాచారి, సొప్పరి సోమయ్య, బంటు పాండు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా రాహు కాలార్చన



నవ తెలంగాణ-కొండపాక

కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శుక్రవారం రాహుకాలార్చన అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. విజయదుర్గా ఉపాసకులు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆరున్నర గంటలకు గణపతి పూజ స్వస్తివాచనంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఉదయం 10-30 గంటలకు రాహుకాల పూజ ఆరంభం అయింది. భక్తులతో మహాసంకల్పం చేయించి నిమ్మదొప్పలలో దీపాలు వెలిగించి తమ బాధలు తొలగిపోవాలని అమ్మవారిని అర్థించారు. అనంతరం కుజదోషం నివారణ కోసం సుబ్రహ్మణ్య స్వామి పూజ నిర్వహించారు. రాహుదోష నివారణ కోసం దుర్గా దేవికి విశేషపూజ చేసి, కేతు గ్రహ దోషాలు తొలగి పోవడానికి గణపతి అర్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాలసర్పదోషం అపసవ్య కాలసర్ప దోషం సర్పదోషం తొలగిపోవడానికి అష్టనాగపూజ చేశారు. పిమ్మట సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకం జరిగింది. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు మోహన్ కృష్ణశర్మ బి.లక్ష్మణరావు, క్షేత్రనిర్వహణా కమిటీ సభ్యులు గట్టు విఠల్ నర్సింహారెడ్డి లగిశెట్టి రాజు మర్యాల రవీందర్ సిల్వేరు శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ రాజశేఖర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కండువా కప్పుకున్న మున్సిపల్ కమిషనర్



కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్

నవ తెలంగాణ-సిద్దిపేట

పార్టీలు, కుల, మతాల కతీతంగా ఓ అధికారిగా తన బాధ్యతలను నిర్వహించాల్సిన మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, అధికార పార్టీకి తొత్తుగా మారారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అనధికారికంగా అధికార పార్టీకి చెందిన కండువాను కప్పుకుని మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ అధికారిగా చలామణి అవుతున్నారన్నారు. తంజీమ్ రద్దు అయిందని, త్వరలోనే ఎన్నికలు నిర్వహించనున్నారని, కనీసం ఈ విషయం తెలవకుండా తంజీమ్, అధికార పార్టీకి చెందిన ముస్లిం నాయకులతో బక్రీద్ పండుగ కోసం సమావేశం నిర్వహించడం హాస్యాస్పదమన్నారు. సమావేశానికి ఇతర పార్టీల నాయకులను ఎందుకు పిలవలేదని, హాజరయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. తొందరలోనే ముస్లిం నాయకులతో కలిసి కమిషనర్‌కు తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో స్మశానవాటికలను శుభ్రపరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గయాజుద్దీన్ , మైనార్టీ పట్టణ ఉపాధ్యక్షులు ఎన్ ఎస్ యు ఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రాషద్ పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహన సదస్సు



నవతెలంగాణ-కోహెడ

కోహెడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన సదస్సును కోహెడ ఎస్సై నరేందర్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. షీటీం ఎల్లప్పుడు మహిళల రక్షణకోసం పనిచేస్తుందని ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై మల్లేశం, మహిళా పీసీలు తార, రజిత, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ విజయానికి సైనికుల వలె పనిచేయాలి



నవ తెలంగాణ-దుబ్బాక : వచ్చే ఎన్నికల్లో దుంపలపల్లి వార్డు నుంచి బిఆర్ఎస్ పార్టీకి భారీ మెజార్టీని అందిద్దామని, బిఆర్ఎస్ గెలుపు కోసం ప్రతి ఒక్కరు సైనికుల వలె పని చేయాలని బీఆర్ఎస్ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణ గౌడ్ కోరారు. శుక్రవారం దుబ్బాక పురపాలిక పరిధిలోని దుంపలపల్లి 4,5 వార్డుల్లో బిఆర్ఎస్ 50, 51వ బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. 50 వ బూత్ అధ్యక్షుడిగా బిజ్జ లింగయ్య,51 వ బూత్ అధ్యక్షుడిగా ధర్మారెడ్డి రఘునందన్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.మెదక్ ఎంపీ,బిఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి నాయకత్వంలో వచ్చే ఎన్నికల్లో దుబ్బాక పై గులాబీ జెండాను ఎగరవేయడం లక్ష్యంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. 4 వ వార్డ్ కౌన్సిలర్ ఇల్లందుల శ్రీనివాస్,బిఆర్ఎస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి,సీనియర్ నాయకులు రొట్టె రాజమౌళి,గన్నె భూమిరెడ్డి,అధికం బాలకిషన్ గౌడ్,ఏఎంసీ డైరెక్టర్ వెంకటస్వామి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట వాసవి క్లబ్ సేవలు అభినందనీయం

నవ తెలంగాణ - సిద్దిపేట

వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్, వాసవి యూత్ క్లబ్‌లు కులమతాలకతీతంగా చేస్తున్న సేవలు అభినందనీయమని వాసవి క్లబ్ విసిఐ నాయకులు దొడ్డ మోహన్ రావు అన్నారు. డాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా ఐపీసీ జైన అర్చనరాజ్‌తో కలిసి పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ముగ్గురు నిరుపేదలకు 25 కిలోల బియ్యం, కిరాణా సరుకులు, 30 మంది మహిళలకు చీరలు, ముగ్గురు పేద రైతులకు యూరియా పంపిణీ, ఆర్మీ కుటుంబానికి సన్మానం, సిరిసిల్ల బైపాస్ రోడ్డులో లో వెల్కమ్ బోర్డు కార్యక్రమాలను వారు నిర్వహించారు. అనంతరం స్థానిక కాటన్ మార్కెట్, వాసవి నగర్‌లో సిమెంట్ బెంచి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట మూడు వాసవి క్లబ్‌లు మంచి కార్యక్రమాలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని అన్నారు. 170 రోజులలోనే 270 పైచిలుకు కార్యక్రమాలు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ పుల్లూరు శివకుమార్, ఐపీసీలు యాద శ్రీనివాస్, గంప కృష్ణమూర్తి, డిస్ట్రిక్ట్ ఇన్చార్జ్ లు మాంకాళ నవీన్ కుమార్, తడ్కమడ్ల శంకరయ్య, జోన్ చైర్మన్ సోమ వనజ, రీజియన్ సెక్రెటరీ మాంకాళ శ్రీనివాస్ , మూడు



క్లబ్బుల పిఎస్టీలు చింత రాజేంద్ర ప్రసాద్, తొడుపునూరు కృష్ణవేణి, అర్వపల్లి హరికిరణ్, చకిలం రవి, బూరుగు వేణు, తిమ్మిశెట్టి విజయలక్ష్మి, పీఆర్వోలు అయిత శంకర్, మాంకాళ సంతోష్, మాంకాళ సుప్రియ, గ్రీటింగ్ చైర్మన్ మర్యాల వీరేశం, క్లబ్స్ ప్రతినిధులు లింగ శ్రీనివాస్, క్యాస బాలయ్య, రాజు, ఆకుల వెంకటేశం, ఉప్పల రమేష్, వీరేశం, ఎర్రం శివకుమార్, చింత సరోజ, అయిత మంజుల, చకిలం వినోద, సోమ మంజుల, సభ్యులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో మష్రుమ్ ట్రైనింగ్



నవతెలంగాణ-ములుగు

సిద్దిపేట్ జిల్లా ములుగు మండల్ నర్సాపూర్ గ్రామంలో సరిస్కా సేవా సంస్థాన్, ఇంటర్ టిక్ ప్రైవేట్ లిమిటెడ్ కలిసి అగ్రికల్చర్ సస్టైనబిలిటీ ప్రోగ్రాం ద్వారా నర్సాపూర్ గ్రామ వాసులకు మష్రుమ్ ట్రైనింగ్ ఇచ్చారు. ఈ ట్రైనింగ్ మూడు రోజులు కొనసాగగా మూడవరోజు రైతులను ప్రోత్సహించడానికి వారికి మష్రుమ్ బెడ్స్ పంపిణీ చేశారు. ఈ ట్రైనింగ్‌లో భాగంగా మష్రుమ్‌ని ఎలా పెంచాలి వాటి మార్కెటింగ్ విధానాలు తెలియజేశారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కిసాన్ సేవా కేంద్ర అధికారులు మేనేజర్ గగన్ శర్మ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సందీప్ యాదవ్ మష్రుమ్ ట్రీనర్ బాలస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ లావణ్య ఆధ్వర్యంలో జరిగింది.

మంద కృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలి



నవ తెలంగాణ- గజ్వేల్

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శక్తి గార్డెన్‌లో ఈ నెల 25వ తేదిన మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన అనుబంధ సంఘాల సభను విజయవంతం చేయాలని నిర్వహించనున్న ఎంస్పీ రాష్ట్ర నాయకులు మైస రాములు కోరారు. స్థానిక గజ్వేల్‌లో మాదిగ ఉపకులాలైన మాష్టి కులస్థులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. దళితుల్లో ఇప్పటికి అత్యంత పేదవారిగా ఉంటూ సమాజం చేత ఛీత్కారాలకు చిదరింపులకు అవమానాలకు గురవుతున్న మాష్టి చిందు దక్కలి మొదలగు 59 కులాల వరకు ఉన్నాయన్నారు. జనాభా ప్రాతిపదికన ఎవరి వాటా వారికి అందేలా వర్గీకరణను ద్వారా చూడాలన్నారు.

మంచె నర్సింలుకు ఘన సన్మానం



నవతెలంగాణ-దుబ్బాక

రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యుడిగా లచ్చపేట వార్డుకు చెందిన మంచె నర్సింలు నియమింపబడటం పట్ల దేశాయ్ బీడీ కంపెనీ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.గత 20 ఏళ్లుగా కార్మికుల పక్షాన నిలబడి చేసిన పోరాటాని కి గాను మంచె నర్సింలు కు దక్కిన అరుదైన గౌరవమన్నారు.శుక్రవారం దుబ్బాక పురపాలిక పరిధిలోని చేర్వాపూర్ వార్డులో గల దేశాయి బీడీ కంపెనీలో పనిచేస్తున్న ప్యాకింగ్,బట్టి కార్మికులు కలిసి మంచె నర్సింలును శాలువాతో ఘనంగా సన్మానించారు.భవిష్యత్తులో ఆయన మరెన్నో పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు.బీడీ ప్యాకింగ్ కార్మికులు తడక భాస్కర్,సుధాకర్, సంతోష్ కుమార్,బైరగోని రమేష్,వడ్లకొండ నాగరాజు,పోలాస రాజు,వంగ భాను,బట్టి కార్మికులు బైరగోని వెంకటస్వామి పలువురున్నారు.

నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్



నవ తెలంగాణ - దౌల్తాబాద్

సీఎం సహాయ నిధి ద్వారా నిరుపేదలకు వరం లాంటిదని బిఆర్ఎస్ నాయకులు పంజా స్వామి అన్నారు. శుక్రవారం మండల పరిధిలో గాజులపల్లి గ్రామనికి చెందిన బాసన్ గారి రవీందర్ రెడ్డి 13500 రూపాయల మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి కొండల్ రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, స్వామి, చాంద్ పాషా, రాజు, రాములు, సురేందర్ , మల్లా రెడ్డి, మహిపాల్ రెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా మామిడి మోహన్ రెడ్డి



నవ తెలంగాణ- రాయపోల్

ఆపదలో ఉండే నిరుపేద కుటుంబాలకు అధైర్య పడవద్దు అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ బాధిత కుటుంబాలను పరామర్శిస్తూ అండగా నిలుస్తున్నారు ప్రజాహిత ఫౌండేషన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మామిడి మోహన్ రెడ్డి.శుక్రవారం రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలోని రంజాన్ భార్య బిపాష అనారోగ్యంతో మరణించారు. అనాజీపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త శ్రవణ్ కుమార్ రెడ్డి తండ్రి మరణించారు. తాల్ల బాలయ్య తల్లి మరణించారు. విషయం తెలుసుకుని వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలనీ వారి కుటుంబాలకు ఆపద వస్తే అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి లింగాయపల్లి యాదగిరి, అనాజిపూర్ సర్పంచ్ శోభారాణి, కో ఆప్షన్ సభ్యులు పర్వేజ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సంతోష్, బాలరాజ్ గౌడ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ మురళి గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ చారి, ప్రజాహిత ఫౌండేషన్ సభ్యులు నరసింహారెడ్డి, ప్రవీణ్, ప్రశాంత్, నాయకులు వెంకట్ గౌడ్,కృపాకర్,కరుణాకర్,షాదుల్, వాజిద్, స్వామి, సలీం, విష్ణు, యూనిస్, భూమయ్య, వెంకట్, ఇస్తారి, యాదగిరి, నరసింహారెడ్డి, రాములు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌బి వార్షికోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-చేర్యాల

ఏ ఐ ఎస్ బి 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలో వార్షికోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి భోగి మనోహర్ మాట్లాడుతూ ఏఐఎస్‌బి విద్యారంగ సమస్యల పరిష్కారానికై రాజీలేని పోరాటాలు చేస్తూ విద్యార్థులలో జాతీయ భావాలను పెంపొందిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు కరణ్,అజయ్, చరణ్, లక్ష్మణ్, భార్గవ్, నవీన్, కళ్యాణ్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో బీజేపీ ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-మద్దూరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రజలకు వివరించాలని బీజేపీ జనగామ అసెంబ్లీ కన్వీనర్ బల్ల శ్రీనివాస్ అన్నారు. బిజెపి సంపర్క్ అభియాన్ లో భాగంగా, మద్దూరు మండల కేంద్రంలోని పలు గ్రామాలలో గడపగడపకు తిరిగి కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలను కరపత్రాలను స్టిక్కర్లను పంపిణీ చేశారు, అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు, బిజెపి ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలల్లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రాల అభివృద్ధి సంక్షేమ కోసం అనేక నిధులను మంజూరు చేశారని ఆయన గుర్తు చేశారు, ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు అమలు చేయడంలో బి.ఆర్.ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన అన్నారు, రానున్న ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ చిత్తుగా ఓడిపోవడం ఖాయమని ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో బిజెపి జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు బేజారి బీరప్ప, బీజేవైఎం జిల్లా కార్యదర్శి సోగాల మనోజ్ కుమార్, మండల అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, బిక్షపతి నాయక్, అఫ్జల్, రామకృష్ణారెడ్డి, యాదగిరి, నవీన్, బాలేశ, మహేష్, వీరయ్య, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 05 వార్డులో ముట్రాజ్ పల్లి శక్తి కేంద్రం 192, 194, 197 బూత్ లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో బీజేపీని బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. పార్టీ అధిష్టానం పిలుపుమేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి శివ కుమార్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ మన్నే శేఖర్, ఉషాకొయిల శ్రీనివాస్, మెతుకు బుధయ్య తదితరులు పాల్గొన్నారు.





నవ తెలంగాణ- సిద్దిపేట

తొమ్మిది ఏళ్ల మోడీ పాలనలో అన్ని విజయాలని, రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారని బీజేపీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి అంబడిపల్లి శ్రీనివాస్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 64వ బూతు అధ్యక్షులు శశిధర్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి బీజేపీ కాలంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాన్ని ఇంటింటికీ అందిస్తూ, బీజేపీ పాలనను సమర్థిస్తూ 9090902024 టోల్ ఫ్రీ నెంబర్ కు మిస్డ్ కాల్ చేయాలని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి యాదవ్ రావు, ఆశయ్య, భీమరిలింగం, రంజిత్ కుమార్, హరిబాబు, రమేష్ యాదవ్, ఎల్లం, తదితరులు పాల్గొన్నారు.